ఆంధ్రజ్యోతి
ప్రకాశం 3
జిల్లా వార్తలు
గురువారం 26, సెప్టెంబరు 2024


పొదిలి మండలం ఉప్పలపాడులోని సొసైటీ భవనం

సహకారానికి తూట్లు

సొసైటీల్లో అక్రమ నియామకాలు

గ్రామీణ ప్రాంత రైతులకు సేవలందించేందుకు ఆవిర్భవించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) అక్రమాలకు నిలయాలుగా మారాయి. వాటికి సంబంధించి గత పాలక వర్గాలు/పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. సొసైటీలను నష్టాల ఊబిలోకి నెట్టాయి. ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేసి తమదే అధికారం అన్న భావనతో అక్రమ నియామకాలకు తెరతీశాయి. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా సొసైటీల్లో గుమస్తాలను నియమించాయి. అయినప్పటికీ సహకార అధికారులు మిన్నకుండిపోయారు. ఆ శాఖ ఆడిటర్లు తమ వార్షిక నివేదికల్లో సొసైటీల్లో అక్రమ నియామకాలను ప్రస్తావిస్తున్నా పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది.

- ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతర్
- గత వైసీపీ పాలనలో పర్యవేక్షణ గాలికి
- ఇష్టానుసారం వ్యవహరించిన పీఏసీలు
- డీఎల్ఈసీ సమావేశంలో జేసీ ఆగ్రహం
- చర్యలకు ఆదేశం.. వణుకుతున్న సిబ్బంది

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 25 : వ్యవసాయ సహకార పరపతి సంఘాలు గత ఐదేళ్లలో దారి తప్పాయి. రైతుల కోసం ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభించిన సొసైటీలను గత వైసీపీ పాలకులు గాలికొదిలేశారు. ఎన్నికలు లేకుండా చేసి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ఏర్పాటు చేసి వారికి అధికారాన్ని కట్టబెట్టారు. దీంతో వారు ఇష్టానుసారం సొసైటీలతో ఆడుకున్నారు. అవన్నీ ఒక్కొక్కటిగా ఇప్పుడు బయటపడుతున్నాయి. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఎంపవర్డ్ కమిటీ (డీఎల్ఈసీ) సమావేశంలో సొసైటీల్లో చోటుచేసుకున్న అక్రమ నియామకాల వ్యవహారం బయటపడింది. దీనిపై డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వర చర్యలకు ఆయన ఆదేశించారు. విభజిత జిల్లాలో 93 సొసైటీలు ఉండగా వీటిలో కనీసం 20 సంఘాల్లో అప్పటి పాలకవర్గాలు, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ (పీఐసీ)లు గుమస్తాలను నియమించాయి. ఒక్కొక్కరికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకూ జీతం చెల్లిస్తున్నారు. సొసైటీల నియామకాలు, తొలగింపుల అధికారం పాలకవర్గాల్లో పీఐసీలకే ఉంటుంది. దీనిని ఆసరా చేసుకుని ముందస్తుగా ఎటువంటి అనుమతులు లేకుండా సిబ్బందిని నియమించారు.



అక్రమాలపై జేసీ ఆగ్రహం

పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఇటీవల నిర్వహించిన డీఎల్ఈసీ సమావేశంలో సొసైటీల సిబ్బందిని అక్రమంగా నియమించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలి మండలం ఉప్పలపాడు శ్రీరామలింగేశ్వర పీఏసీఎస్‌లో అనధికారికంగా సిబ్బందిని నియమించడాన్ని పీడీసీసీ బ్యాంకు హెచ్‌ఆర్ సెల్ డీఎల్ఈసీ దృష్టికి తెచ్చింది. సొసైటీల్లో సిబ్బంది నియామకాలకు సంబంధించి ప్రభుత్వం 2019 మార్చి 1న జారీ చేసిన జీవో నెంబరు 36, 2021 జనవరి 22న జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం వ్యవహరించాలని సొసైటీ పీఐసీని ఆదేశిస్తూ డీఎల్ఈసీలో తీర్మానం చేశారు. ఆ మేరకు ఆ సిబ్బందిని సొసైటీ పీఐసీ తొలగించనుంది. కాగా ఈ వ్యవహారం బయటకు రావడంతో సొసైటీలలో పనిచేస్తున్న అనధికార సిబ్బంది వణికిపోతున్నారు. మరి జిల్లాలోని మిగిలిన సొసైటీల్లో అక్రమంగా నియమించిన వారిపై ఏమి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

అధికారం అండతో ఇష్టారాజ్యం

సొసైటీల పాలకవర్గాలు/పీఐసీలు ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోకుండా అధికారం అండతో సిబ్బంది నియామకాలకు తెగబడ్డాయి. హెచ్‌ఆర్ విధానం అమలుకు సంబంధించి ప్రభుత్వం 2019 మార్చి 1న ఉత్తర్వులు జారీ చేసింది. వాటి నకళ్లను జిల్లాలోని అన్ని సొసైటీలకు పంపించింది. ఈ విధానం అమలుకు సంబంధించి పీడీసీసీ బ్యాంకు కూడా సొసైటీలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 2019 మార్చి 1 తర్వాత సొసైటీ పాలక వర్గాలు నేరుగా తమ పరిధిలో సిబ్బందిని నియమించకూడదు. సిబ్బందిని ఇష్టానుసారం తొలగించకూడదు. ఈ రెండింటిలో ఏది చేయాలన్నా పీడీసీసీ బ్యాంకు చైర్మన్/పర్సన్ ఇన్‌చార్జి అధ్యక్షతన గల జిల్లాస్థాయి ఎంపవర్డ్ కమిటీ (డీఎల్ఈసీ) ఆమోదం తప్పనిసరి. అయితే ఇవేమీ లేకుండా పాలకవర్గాలు నేరుగా సిబ్బందిని నియమించాయి. సొసైటీలకు ఆదాయం, లావాదేవీలు పెరిగి అదనపు సిబ్బంది అవసరమైతే డీఎల్ఈసీకి ప్రతిపాదనలు పంపి ఆమోదం పొందిన తర్వాతే నియమించాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోలేదు.


బట్టువారిపల్లి వద్ద వాగులో చిక్కుకుపోయిన బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో ఒడ్డుకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

జిల్లావ్యాప్తంగా వర్షం

- పశ్చిమాన భారీ, తూర్పున మోస్తరు
- సగటున 33.0 మి.మీ నమోదు
- పలుచోట్ల పొంగిన వాగులు, వంకలు
- అక్కడక్కడా రాకపోకలకు ఆటంకం
- ఖరీఫ్ పైర్లకు జీవం, రబీ సాగుకు అనుకూలం

ఒంగోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం వేకువజామున వర్షం కురిసింది. పశ్చిమప్రాంతంలో భారీగా పడింది. తూర్పుప్రాంతంలో ఒక మోస్తరు జల్లులు కురిశాయి. బుధవారం ఉదయం 9 గంటలకు 24 గంటల వ్యవధిలో జిల్లాలో సగటున 33.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదిలి మండలంలో 104.6 మి.మీ కురిసింది. మార్కాపురంలో 77.6 మి.మీ, కంభం, కొనకనమిట్ల, బేస్తవారపేట, దర్శి, తర్లుపాడు, మర్రిపూడి, దొనకొండ, సీఎస్‌పురం, కురిచేడు మండలాల్లో 50 నుంచి 75 మి.మీ కొమరోలు, సింగరాయకొండ, ముండ్లమూరు, తాళ్లూరు, పీసీపల్లి, పామూరు, పెద్దారవీడు మండలాల్లో 25.0మి.మీ నుంచి 50.0 మి.మీ మధ్య నమోదైంది. ఇతర చోట్ల ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. కాగా పశ్చిమప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు కూడా కొంతసేపు ఆటంకం ఏర్పడింది.

వాగులో చిక్కుకున్న బస్సు

పొదిలి మండలం బట్టువారిపల్లి వద్ద వాగు పొంగి అందులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోగా అధికారులు గ్రామస్థుల సహకారంతో సురక్షితంగా బయటకు చేర్చారు. బస్సులో ప్రయాణికులు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మార్కాపురం-పొదిలి మార్గంలో రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. తర్లుపాడు, మార్కాపురం, కంభం, అర్ధవీడు, బీపేట తదితర మండలాల్లో అక్కడక్కడా వాగులు పొంగి రవాణాకు ఆటంకం కలిగింది. ప్రస్తుత వర్షం సాగుకు బాగా ఉపయుక్తం కానుంది. ఖరీఫ్‌లో దాదాపు 2.75 లక్షల ఎకరాల్లో పంటలు వేగా 90 శాతం పొలంలోనే ఉన్నాయి. ప్రధానంగా కంది, పత్తి, సజ్జ వంటివి ఉండగా వాటన్నింటికి ఈ వర్షం జీవం పోసింది. పలుచోట్ల పొగాకు, మిర్చి, వరినాట్లు వేస్తుండగా అవి జోరుగా సాగుతున్నాయి. వచ్చేనెల 1 నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్ పంటల సాగుకు ఈ వర్షాలు బాగా మేలు చేశాయి. ప్రధానంగా అక్టోబరులో పొగాకు, మిర్చి, వరి సాగు పశ్చిమప్రాంతంలో అధికంగా చేస్తారు. అలాంటి ప్రాంతాలకు ఈ వర్షాలు బాగా ఉపకరించనున్నాయి. అలాగే తూర్పు ప్రాంతంలోనూ రబీ సాగుకు భూములు సిద్ధం చేసుకునేందుకు తాజాగా వర్షాలు ఉపకరించనున్నాయి.

మళ్లీ ఫ్లెక్సీల రగడ

ఒంగోలులో బాలినేని బొమ్మలు చించివేత

- లాయర్‌పేటలో జనసేన నాయకుల నిరసన
- నేడు జనసేనలోకి బాలినేని
- ఆయన్ను చేర్చుకోవద్దంటూ టీడీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమైన వేళ ఒంగోలులో ఫ్లెక్సీల రగడ మరోసారి రాజుకుంది. తొలుత బాలినేని పార్టీ మార్పుపై ఎమ్మెల్యే జనార్దన్ ధ్వజమెత్తడం, అంతకుముందు మాజీమంత్రి అనుచరులు వేసిన ఫ్లెక్సీని టీడీపీ శ్రేణులు తీసివేసే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఆ రెండు విషయాలపై బాలినేని కూడా స్పందించారు. ఈనేపథ్యంలో గురువారం బాలినేని జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే బుధవారం రాత్రి బాలినేని అనుయాయులు వేసిన ఫ్లెక్సీలను మరోమారు గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. అదేసమయంలో బాలినేనిని జనసేనలో చేర్చుకోవద్దంటూ తెలుగు యువత శ్రేణులు నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించాయి. తిరిగి బుధవారం రాత్రి ఎన్నికల ముందు టీడీపీలో చేరిన సూర్యప్రకాశ్‌రెడ్డి.. బాలినేని మంత్రిగా అవినీతికి పాల్పడినందున పార్టీలోకి చేర్చుకోవద్దంటూ జనసేన అధినేత పవన్‌కు బహిరంగంగా సూచించారు. స్థానికంగా జరిగే అంశాలను పట్టించుకోకుండా గురువారం సాయంత్రమే పవన్ వద్ద పార్టీలో చేరాలని మాజీ మంత్రికి సమాచారం వచ్చింది. నగరంలో వ్యాపారవేత్త అయిన కంది రవిశంకర్, అతని సమీప బంధువు గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే రోశయ్య కూడా గురువారం జనసేనలో చేరనున్నారు.

ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి

మాజీమంత్రి బాలినేని జనసేనలో చేరికను స్వాగతిస్తూ లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు బొమ్మ, వీఐపీ రోడ్డు, జయరాం థియేటర్ సెంటర్, సీవీఎన్ రీడింగ్‌రూం తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిని మంగళవారం రాత్రి పెట్టగా, తెల్లవారేసరికి ఎవరో చించి వేశారు. ఆ ఫ్లెక్సీల్లో కేవలం బాలినేని ఫొటో ఉన్నంత వరకే చించివేసి మిగిలినవి అదేవిధంగా ఉండేలా చేశారు. దీంతో బుధవారం ఉదయం నుంచి ఈ విషయంపై విస్తృతంగా చర్చ నడిచింది. లాయర్‌పేటలోని ఫ్లెక్సీ వద్ద జనసేన పార్టీలోని కొంతమంది నిరసన తెలిపారు. మరోవైపు నగరంలో ఫ్లెక్సీల చించివేతపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం మధ్యాహ్నం ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలినేని వెంట గొర్రెపాటి శ్రీనివాసరావు, జడా బాలనాగేంద్రయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.


చంద్రబాబుకు బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న సత్య, బాలాజీ, దినకర్

సీఎంను కలిసిన చైర్మన్లు

- ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని చంద్రబాబు సూచన

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కొత్తగా కార్పొరేషన్ చైర్మన్లు అయిన దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, లంకా దినకర్ బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. వీరిలో సత్య బాలాజీలు టీడీపీ తరఫున, దినకర్ బీజేపీ తరఫున చైర్మన్లుగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన కొత్తగా నియమితులైన 20మంది చైర్మన్లతో భేటీ అయ్యారు. ఆ తర్వాత జిల్లాకు చెందిన ముగ్గురు చైర్మన్లు చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆ సందర్భంగా బాబు మాట్లాడుతూ నిజాయితీగా, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించారు.

ఎక్సైజ్ డీసీగా హేమంత్ నాగరాజు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: ఎక్సైజ్ శాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ప్రభుత్వం విలీనం చేసింది. ప్రస్తుతం పాత పద్ధతిలోనే జిల్లాను యూనిట్‌గా తీసుకొని డిప్యూటీ కమిషనర్‌గా నెల్లూరు ఎస్ఈబీలో ఉన్న కె.హేమంత్ నాగరాజును నియమించింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయ, సూపరింటెండెంట్‌గా ఖాజామొహిద్దీన్‌ను నియమించింది. ఖాజామొహిద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులను కలిసేందుకు విజయవాడ వెళ్లారు.

మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూత

- విషాదంలో మాగుంట కుటుంబం
- సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు
- నేడు నెల్లూరులో అంత్యక్రియలు



వివరాలు మెయిన్‌లో..

సబ్ రిజిస్ట్రార్ హేమలతపై వేటు

- రికార్డుల్లో లేని భూమికి రిజిస్ట్రేషన్
- విచారించి సస్పెన్షన్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: ఎర్రగొండపాలెంలో భూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అవకతవకలకు పాల్పడిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హేమలతను సస్పెండ్ చేస్తూ ఆశాఖ డీఐజీ పుష్పలత బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డులో లేని సర్వే నంబరుతో ఆమె రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో విచారణకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేల్చారు. దీంతో ఆమెపై డీఐజీ సస్పెన్షన్ వేటు వేశారు. అంతేకాకుండా విచారణ అనంతరం క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని అధికారులు తెలిపారు. హేమలత ఇంకొల్లులో పనిచేస్తుండగా డిప్యుటేషన్‌పై ఎర్రగొండపాలెం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమెను సింగరాయకొండ మార్చారు.. వైపాలెంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

జడ్పీలో బదిలీల ఫైట్

- ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ ఇన్‌చార్జి
- డిప్యూటీ సీఈవో వద్ద సాగర్ ఒత్తిడి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల బదిలీల వ్యవహారం చినికిచినికి గాలివానలా మారింది. ప్రధానంగా దర్శి నియోజకవర్గంలోని నియామకాల విషయాన్ని వైసీపీకి చెందిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త సాగర్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో వివాదం ముదిరింది. బుధవారం జడ్పీ కార్యాలయానికి వెళ్లిన డాక్టర్ సాగర్ డిప్యూటీ సీఈవోతో వాదనకు దిగడం, అదేసమయంలో ఒకరిద్దరు ఆయన అనుచరులు ముఖ్యంగా ఒక మీడియా వ్యక్తి దూకుడుగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. వైసీపీకి చెందిన బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండగా ఆమె కుమారుడు శివప్రసాద్‌రెడ్డి దర్శి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో తాము కోరిన వారినే ఎంపీడీవోలుగా నియమించాలని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పట్టుపడుతుండగా జడ్పీ చైర్‌పర్సన్ వైపు నుంచి కొన్ని మండలాల అధికారులను తాము కోరినట్లు నియమించాలన్న ఒత్తిడి అధికారులపై వచ్చింది. జడ్పీకి ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా మాధురి, డిప్యూటీ సీఈవోగా హనుమంతరావు ఉన్నారు. అనుకూలమైన కొత్త సీఈవోను నియమించుకుని ముందుకెళ్లాలని అధికారపార్టీ నేతలు భావించారు. కొత్త సీఈవో నియామకంలో జాప్యం జరిగి రెండ్రోజుల క్రితం నెల్లూరు నుంచి చిరంజీవి అనే అధికారిని నియమించారు. ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిపోతుండటంతో ఎంపీడీవోల బదిలీలకు శ్రీకారం పలికారు. ఎక్కువ నియోజకవర్గాలకు సంబంధించి అధికార టీడీపీ ఎమ్మెల్యేలు సూచించిన వారినే నియమించారు. దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల విషయంలో పోటీ నెలకొంది. ఇటు జడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు ఆమె కుమారుడైన ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి తాము సూచించిన వారినే ఆయా మండలాలకు నియమించాలని అధికారులపై ఒత్తిడి పెంచారు. మరోవైపు టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి, ఆమె భర్త సాగర్ తాము చెప్పిన వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు ఒత్తిడికి గురై దర్శి నియోజకవర్గ ఎంపీడీవోల నియామకాన్ని బుధవారానికి పూర్తి చేయలేదు.

కార్యాలయంలో గందరగోళం

జడ్పీ కార్యాలయానికి బుధవారం లక్ష్మి భర్త సాగర్ వెళ్లారు. ఆయన డిప్యూటీ సీఈవో వద్ద ఉద్యోగులను బదిలీ చేసే అధికారం మీదే కాబట్టి తాము సూచించిన వారినే ఎంపీడీవోలుగా నియమించాలని పట్టుబట్టారు. కొద్దిసేపటికి ఆ గదిలోకి వెంకాయమ్మ సీసీ వచ్చి బదిలీలు చేసే అధికారం చైర్‌పర్సన్‌కు ఉంటుందని, ఆమె సూచించిన వారినే దర్శిలోని మండలాలకు పంపాలని, కాదంటే ఇబ్బందిపడతారని హెచ్చరించారు. దీంతో సాగర్ పక్కన ఉన్న దర్శి నియోజకవర్గానికి చెందిన వారు చైర్మన్ సీసీతోపాటు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో సాగర్‌తోపాటు జడ్పీకి వెళ్లిన ఒక జర్నలిస్ట్ దూకుడుగా వ్యవహరిస్తూ ఉద్యోగులు, సీసీని నిలదీసి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో కార్యాలయంలో వివాదం పెద్దదైంది. డిప్యూటీ సీఈవో అటు చైర్మన్ సీసీకి కానీ, ఇటు సాగర్‌కు కానీ ఎలాంటి హామీ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. ఆతర్వాత టీడీపీ నాయకుడు సాగర్ కలెక్టర్ అన్సారియాను కలిసి బదిలీల అధికారం సీఈవోకే ఉంటుందని, అందుకు భిన్నంగా బదిలీ చేస్తే మేము ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని చెప్పినట్లు తెలిసింది.

నేడు రామతీర్థం సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం

• హాజరుకానున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బీఎన్


ప్రారంభానికి సిద్ధమైన సబ్‌స్టేషన్

చీమకుర్తి, సెప్టెంబరు 25: మండలంలోని రామతీర్థం సమీపాన నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ప్రారంభించటానికి అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తదితర నాయకులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. రూ.3.50కోట్లతో నిర్మించిన ఈ 33/11కేవీ సబ్‌స్టేషన్ రామతీర్థం పరిసరప్రాంతాల్లో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమకు వరం లాంటిది. విద్యుత్ సరఫరాలో లోటల్టేజి తదితర అంతరాయాలు లేకుండా సరఫరా చేయటానికి ఉపయోగపడుతుంది.

పార్వతమ్మకు పలువురి నివాళి


పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25 : ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మాగుంట అభిమానులు, టీడీపీ నాయకులు పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయినాబత్తిన ఘనశ్యాం, బెల్లం సత్యనారాయణ, తాతా ప్రసాద్, కుప్పా రంగనాయకులు, ఆత్మకూరి బ్రహ్మయ్య, కండె శ్రీనివాసులు, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, బొద్దులూరి నరసింహులు, కుమారస్వామి, రత్నరాజు, మేదిద రవి, షేక్ నజీర్, చిలిపి శీరనివాసరెడ్డి, శీలం రాము, ముజీబ్ పాల్గొన్నారు.

అలాగే మాజీమంత్రి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నెల్లూరులోని మాగుంట నివాసంలో బుధవారం సాయంత్రం పార్వతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు.

హామీల అమలులో ప్రభుత్వం వైఫల్యం

• డీసీసీ అధ్యక్షుడు సైదా


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు25: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆరోపించారు. బుధవారం థాళీ బజావో కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రకాశంభవన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిచారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ 100రోజులలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్ మాట్లాడుతు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలను విస్మరించారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పగడాల పెద్ద రంగస్వామి, పుట్లూరి కొండారెడ్డి, దేవరపల్లి సుబ్బారెడ్డి, జావేద్ అన్వర్, పాలపర్తి విజేష్‌రాజ్, ఉద్దండి మల్లిఖార్జునరావు, మన్నం ప్రసన్నరాజు, బొద్దు సతీష్ పాల్గొన్నారు.

క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ శక్తులను అడ్డుకోవాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ శక్తులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనిఏటి రామకృష్ణ, ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. తరతరాలుగా నాయిబ్రాహ్మణులు కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ఇతర కులస్థులు, కార్పొరేట్ శక్తులు నాయిబ్రాహ్మణ కులవృత్తిలోకి రావడంతో తమజీవన మనుగడకు ఇబ్బందికరంగా మారిందన్నారు. కులవృత్తిని నాయిబ్రాహ్మణులే చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇతర కులస్థులు ఈ వృత్తిలో రాకుండా తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, సాంబశివరావు, అజయ్, హనుమంతరావు పాల్గొన్నారు.

భారీగా రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

80 మందికి పైగా డీటీలు • 450 మందికిపైగా వీఆర్వోలు

ఇతర ఉద్యోగులు 90 మందిపైగానే..

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు భారీగా బదిలీ అయ్యారు. జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులతో పాటు గ్రామస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో)లు భారీగా ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 450 మందికిపైగా వీఆర్వోలు బదిలీలయ్యారు. వారికి గురువారం బదిలీల ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది డిప్యూటీ తహసీల్దార్లు కూడా సుమారు 80మంది వరకు ఉన్నట్లు సమాచారం. బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర ఉద్యోగులు 90 మందికి పైగా బదిలీలయ్యారు. వారందరికి రాత్రికి ఉత్తర్వులు ఇచ్చారు. 9మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు 40, జూనియర్ అసిస్టెంట్లు 37, ఎఫ్ఐలు 4, టైపిస్టులు 8 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు నలుగురు బదిలీలయ్యారు.

డీసీఏవో కేసులో ఆరుగురు నిందితులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి రాజశేఖర్‌పై దాడి కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అయితే కార్యాలయంలో కొంతమంది అధికారులపై తీసుకున్న చర్యలు కారణంగా దాడి చేసినట్లు విచారణలో నిందితులు తెలిపినట్లు సమాచారం. అధికారుల మధ్య ఏర్పడిన వివాదాలు కారణంగా జిల్లా అధికారిపై దాడి చేసే వరకు వచ్చింది. కేసు కొలిక్కి వచ్చిందని ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు గుర్తింపు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడిని గుర్తించారు. ఈనెల 23న ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఉత్తరంగా రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది త్రోవగుంటకు చెందిన కొట్టు భానుప్రకాష్‌గా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అయితే తన కుమారుడిని రెండు నెలల క్రితం త్రోవగుంటకు చెందిన నావూరి అనురాధ కుటుంబసభ్యులు కొట్టి బెదిరించారని తల్లి సుభాషిణి ఆరోపించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న భానుప్రకాష్ ఈనెల 22న ఒంగోలు వచ్చాడని, మరలా వారే తన కుమారుడిని బెదిరించడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని, పోలీసులు విచారణ చేయాలని ఆమె కోరారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పోస్టల్‌శాఖ పథకాలపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

చీమకుర్తి, సెప్టెంబరు 25: పోస్టల్‌శాఖ అందిస్తున్న పథకాలపై బుధవారం చీమకుర్తిలో ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్‌సిద్ధిఖీ ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రాజు, కాలే రామారావు, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అందమైన నగరంగా ఒంగోలు!

• కలెక్టర్ తమీమ్ అన్సారియా



నెమలి పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 25 : అందమైన నగరంగా ఒంగోలును తీర్చిదిద్ది రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంచాలని కలెక్టర్ తమీమ్‌అన్సారీయా పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామ్‌నగర్ సమీపంలోని సెంటర్ డివైడర్‌ను వ్యర్థాలతో అర్థం వచ్చేలా, పనికిరాని వాటర్‌బాటిల్స్, నట్లు, బోల్టులతో తయారు చేసిన నెమలి పైలాన్‌ను కలెక్టర్ అన్సారీయా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ నగర సుందరీకరణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. సెంటర్ డివైడర్‌లలో అందమైన మొక్కలు నాటి, అందరూ మెచ్చుకునేలా నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళలో నగరాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులతోపాటు, నగర సుందరీకరణ చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. త్వరలోనే నగరంలో మొక్కలు నాటడంతో పాటు, సెంటర్ డివైడర్‌లను రంగులతో అలంకరించి నగరానికి కొత్త రూపు తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, ఎంసీ జానీబాషా, డీఈలు గణపతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బాలినేనిని జనసేనలోకి చేర్చుకోవద్దు

తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్


చెవిలో పూలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 25: అవినీతి, అక్రమాలు చేసి, ప్రజల చేతిలో ఘోరంగా ఓడిపోయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని టీడీపీ కూటమిలోని జనసేన పార్టీలోకి చేర్చుకోవద్దని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక మిరియాలపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్ళపై కూర్చుని తమ నిరసన తెలియజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్ళలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడిన బాలినేని టీడీపీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టించి, జైలుకు పంపడంతోపాటు భౌతికంగా దాడులు చేసిన బాలినేని ఇప్పుడు ప్రజల చేతిలో ఓడిపోవడంతో తిరిగి అధికారం ఉన్న పార్టీలోకి రావడాన్ని తెలుగుయువత వ్యతిరేకిస్తుందని చెప్పారు. జనసేనలో బాలినేని చేరితే జిల్లాలో గ్రూపు రాజకీయాలతోపాటు, మరోసారి కక్ష సాధింపు చర్యలు చేపడతారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలినేనిని చేర్చుకునే విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఒక్కసారి పునఃపరిశీలన చేయాలన్నారు. ఎన్నికల ముందు నుంచి టీడీపీ, జనసేన కలిసికట్టుగా పని చేసి, వైసీపీని ఘోరంగా ఓడించామని, బాలినేని జనసేలో చేరితే జనసేన, టీడీపీ మధ్య దూరం పెరిగే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. అంతకముందు ప్రకాశంభవనం వద్ద నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బొడపాటి వెంకట్, నలమోతు రమేష్, గోపు వీరాంజనేయులు, వై.వేణుగోపాల్, ఉమర్ పలువురు తెలుగుయువత కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలినేనికి ముస్లింలు సహకరించొద్దు

ఒంగోలు(కలెక్టరేట్): జనసేన పార్టీలో చేరుతున్న మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ముస్లింలు సహకరించవద్దని ముస్లిం జాగరణ్ మంచ్ రాష్ట్ర కన్వీనర్ షేక్ మహ్మద్ బుజ్జి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలినేని వాటి నుంచి తప్పించుకోనేందుకే జనసేన పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. పార్టీలు మారేవారి పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : బీఎన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, సెప్టెంబరు 25: సంక్షేమం, అభివృద్ధి టీడీపీ కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లని, పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం బసవన్నపాలెంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాధాన్యతాక్రమంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. బసవన్నపాలెంలో సీసీరోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశీలకులు చౌట శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కొప్పోలు విశ్వనాథం, మండవ గోవిందరాజులు, తుమ్మల వీరాంజనేయులు, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, ఎ.శివరాం, మండవ శ్రీనివాసరావు, మండవ మారుతీప్రసాద్ రావు, మండవ రత్నాకర్, తహసీల్దార్ సృజనకుమార్, ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి చేతులు కట్టేసి..దాడి చేసి..

• రూ.లక్ష నగదు, బంగారపు ఆభరణాలు అపహరణ

• కాకతీయనగర్‌లో అర్ధరాత్రి దోపిడీ


బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: ఒంటరిగా ఇంట్లో ఉన్న ఓ వృద్ధురాలిపై దుండగులు దాడి చేశారు. రూ.లక్ష నగదు, బంగారపు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ సంఘటన ఒంగోలు నగరం కాకతీయనగర్ రెండో లైన్‌లో బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. నలుగురు దోపిడీ దొంగలు పొన్నం సీతారావమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి వెనుక వాకిలి నుంచి చొరబడ్డారు. ఇద్దరు ఇంట్లోకి రాగా మరో ఇద్దరు వెనుక తలుపు వద్ద ఉన్నారు. లోపలికి వచ్చిన దుండగులు సీతారావమ్మ ముఖానికి కండువా కప్పి దాడి చేశారు. ఆమె చేతులు వెనక్కు విరిచి కండువాతో కట్టివేశారు. అనంతరం బెడ్ రూమ్‌లో ఉన్న తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులో లక్ష రూపాయల నగదు తీసుకున్నారు. ఆమె చెవులకు ఉన్న కమ్మలు తీసుకొని నలుగురు దుండగులు పరారీ అయ్యారు. కొద్దిసేపటి తరువాత బాధితురాలు ఎలాగోలా కట్లు విప్పుకుని ఎదురుగా ఉన్న స్థానికులను నిద్రలేపగా వారు వెంటనే అదే లైన్‌లో నివాసం ఉంటున్న కుమార్తెకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు బుధవారం ఉదయం డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్ పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు కొన్ని ఆధారాలు సేకరించారు.

కుటుంబ సభ్యులకు చిన్నారుల అప్పగింత


నాయనమ్మకు పిల్లలను అప్పగిస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25 : ఏడాది క్రితం తప్పిపోయిన ఇద్దరు బాలికలను తిరిగి వారి నాయనమ్మకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అప్పగించారు. గత ఏడాది నవంబరులో బాపట్లకు చెందిన ఇద్దరు పిల్లలు తప్పిపోయి జిల్లాకు రావడంతో ఒంగోలులోని బాలసదన్‌లో ఉంచారు. వారి తల్లిదండ్రులను గుర్తించేందుకు అనేక సామాజిక మధ్యమాలు, పేపరు ప్రకటనల ద్వారా అధికారులు ప్రయత్నించారు. ఆ పిల్లలను బాపట్ల జిల్లా ఈపూరిపాలెం, స్టూవర్టుపురం ప్రాంతాలకు తీసుకెళ్ళి వారి తల్లిదండ్రులను, బంధువులను గుర్తించే ప్రక్రియలో వారం రోజులు తిరిగారు. చివరకు చిన్నారులు స్టూవర్టుపురంలో వారి నాయనమ్మను గుర్తించారు. ఈక్రమంలో స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం చిన్నారులను నాయమ్మకు అప్పగించారు. అయితే ఆ పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో కలెక్టర్ అన్సారియా బాపట్ల జిల్లా బాలసదన్‌లో ఉంచివారి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు డి.నీలిమ, సుమనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'మన ఇల్లు-మన గౌరవం' విజయవంతం చేయాలి

• ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి

చీమకుర్తి, సెప్టెంబరు 25 : పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయటానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి కోరారు. బుధవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో మంజూరై అసంపూర్ణంగా నిలిచిన గృహనిర్మాణాలను సత్వరమే ప్రారంభించాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులతో లేఅవుట్ల వద్ద ఈనెల 28న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, తహసీల్దార్ బ్రహ్మయ్య, కమిషనర్ పోతురాజు, హౌసింగ్ ఏఈ వెంకటస్వామి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు నగరం, సెప్టెంబరు 25: ఆక్వాసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఫ్రాన్స్ వియత్నాం శాస్త్రవేత్తలు డాక్టర్ స్టీఫెన్ రాలైట్, లాక్మాన్స్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో అవంతి సీడ్స్ ఆధ్వర్యంలో రొయ్యల సాగుకు సంబంధించిన టెక్నికల్ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు బ్లాక్‌టైగర్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అవంతి సీడ్స్ జీఎం వీకే.శెట్టి, శ్రీనివాస మహంతి, ఆర్ఎం గోపాలకృష్ణ, నారాయణస్వామి, వెంకటరావు, రవి, డీలర్లు పాల్గొన్నారు.

ఎం.నిడమలూరువాసుల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న సత్య, గ్రామస్థులు

టంగుటూరు, సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితుల సహాయం కోసం మండలంలోని ఎం.నిడమలూరివాసులు రూ2లక్షల విరాళాన్ని సేకరించారు. ఆ మొత్తాన్ని బుధవారం అమరావతిలో సీఎం చంద్రబాబుకు చెక్కురూపంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య టీడీపీ ఎం.నిడమలూరు నాయకులు బొడపాటి అంజిబాబు, రామన్నగారి శ్రీనివాసరావు, కాకుమాని సుబ్బారావు, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్‌బాబు పాల్గొన్నారు.

వరదబాధితులకు కేజీఎఫ్ వితరణ


ఎమ్మెల్యే దామచర్లకు చెక్కును అందిస్తున్న ప్రతినిధి

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు బుధవారం ఒంగోలులో అందజేశారు. కేజీఎఫ్ కార్యవర్గసభ్యులు చిమ్మిరి బాలకృష్ణ, మండవ మురళీకృష్ణ, బైరపనేని సాయి పవన్, పాతూరి మురళీ, మలినేని కోటేశ్వరరావు, లింగంగుంట సాయివెంకటేష్, గోరంట్ల అంజయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25 : శాస్త్ర, సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలు సమాజాన్ని, మానవ జీవితాన్ని అభివృద్ధి పర్చాయని, అందువల్ల సైన్స్ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని జేవీవీ జిల్లా గౌరవ సలహాదారు ఏవీ.పుల్లారావు పేర్కొన్నారు. ఒంగోలులోని రవీంద్రభారతి స్కూలులో బుధవారం చెకుముకి టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఈ పరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయప్రకాష్, ఉపాధ్యాయులు ఆర్ఎల్.ప్రసన్నకుమార్, వై.రమ్య రోహిత్, సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు: జేవీవీ మండల కన్వీనర్ కోదాటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌లో చెకుముకి పరీక్షను నిర్వహించారు. హెచ్ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

దామచర్ల సత్యకు అభినందనలు


సత్యకు బొకే అందజేస్తున్న నాయకులు

మద్దిపాడు, సెప్టెంబరు 25: మారిటైం బోర్డు చైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్యకు పలువువు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డంపూడి శివరామకృష్ణ ఆధ్వర్యంలో వారు బుధవారం తూర్పునాయుడుపాలెంలో దామచర్ల సత్యను కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి సాయి, పోకూరి నవీన్, సజీన్ బాలు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు గుప్తా కేసులో ఇరువురు అరెస్టు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: గుంటూరు లాడ్జిలో మూడేళ్ల క్రితం ఆర్యవైశ్య నాయకుడు ఎస్.సుబ్బారావు గుప్తాపై దాడి చేసిన కేసులో ఒంగోలుకు చెందిన సుభానీ, సైదాలను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలు వ్యవహరించి పలు కేసుల్లో నిందితులైన సుభానీ, సైదాలను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ఈమేరకు న్యాయాధికారి విచారించి ఇరువురికి బెయిల్ మంజూరు చేశారు.

చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణయ్య

చీమకుర్తి, సెప్టెంబరు 25: చీమకుర్తి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా రామకృష్ణయ్య నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకి విచ్చేశారు. గతంలో గిద్దలూరు కమిషనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. అలాగే చీమకుర్తి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కూడా ఇక్కడ విధులు నిర్వహించిన రామకృష్ణయ్యకు పట్టణంలో పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

నేటి నుంచి విద్యార్థులకు పోటీలు : డీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25: వీరగాధ-ప్రాజెక్టు 4లో భాగంగా విద్యార్థులకు పాఠశాల స్థాయిలో గురువారం నుంచి ఈనెల 30 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,4,5 తరగతులు, 6,7,8 తరగతులు, 9,10 తరగతులు, 11,12 తరగతులు ఇలా నాలుగు కేటగిరీలుగా విద్యార్థులకు పద్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. విజేతల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎంఈవోలు, ఉప విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

రైజ్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25: ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు బుధవారం ముగిసినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. సెమికాన్ ఎడ్యుటెక్ డిప్యూటీ డైరెక్టర్ కమల్‌కుమార్ ఈ వర్క్‌షాపు నిర్వహించారు. ఆటోమేటిక్ నియంత్రణ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక చేయూత


ఎమ్మెల్యే జనార్దన్‌కు చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు రూ.25,116 చెక్కును అందజేశారు. ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి విరాళం చెక్కును అందించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, కృష్ణారావు, జానా శ్రీనివాస్, జి.భాస్కర్‌రావు, కె.రాజగోపాల్, సుధాకర్, ఎన్.రమేష్, అనిల్, ఖాజావలి, నాగిరెడ్డి, వెంకటలక్ష్మి, నాగమణి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

29న టెట్ మోడల్ పరీక్ష

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, కనిగిరి టీచర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉపాధ్యాయ అర్హతపరీక్ష(టెట్) మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, కంభం, దర్శి, పొదిలి, ఒంగోలు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు, బీఈడీ మాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు రవి-9848244962 సెల్‌నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భారీ కణితి తొలగింపు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 25: ఒంగోలులోని వసుధకల్యాణ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం ఓ మహిళ గర్భసంచిలో నుంచి నాలుగు కిలోల బరువు గల కణితి తొలగించినట్లు డాక్టర్ వసుధ తెలిపారు. దొడ్డవరప్పాడుకు చెందిన ఓ మహిళ గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుందని, పలు వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో భారీ కణితి ఉందని గుర్తించి అరుదైన ఆపరేషన్ చేసి తొలగించామని చెప్పారు ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ వసుధను అభినందించారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 25: సినీ నేప ధ్యగాయకులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతిని శ్రీ అభయ కళారాధన సాం స్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తి ఎస్కేఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు ఎస్పీబాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో బాల సుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.అంజిరెడ్డి, పాల్గొన్నారు. పండ్లు పంపిణీ చేశారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 26: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పేర్నమిట్ట పరిధిలోని 37వ డివిజన్‌లో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను అందజేశారు. డివిజన్ ఇన్‌చార్జ్ మేడికొండ మోహన్‌రావు, ఎ.నరశింహరావు, అజయ్‌బాబు, పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులు ముగిసిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉప్పుగుండూరులో నిర్వహించారు. కూటమి నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలిసి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, పెంట్యాల కోటేశ్వరరావు, టి.జాన్సన్, నాగమల్లేశ్వరావు, గద్దల రమేష్, మసిముక్కు భాస్కర్, రంగయ్య పంతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలినేని జనసేనకు అనర్హుడు : పెద్దిరెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 25 : భూకబ్జాదారుడు బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీకి అనర్హుడని టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రిగా బాలినేని ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే బల్లికురవ మండలంలో 585 ఎకరాల అటవీ భూమిని కబ్జాచేసి తన కుటుంబానికి ధారాదత్తం చేశారని ఆరోపించారు. అందుకు సంబంధించి సాక్ష్యాధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. అవినీతి కారణంగానే బాలినేని ఘోరంగా ఓడిపోయారన్నారు. తన వియ్యంకుడు కుందా భాస్కర్‌రెడ్డి పేరు మీద దాదాపు 44 ఎకరాల భూమిని బల్లికురవ గ్రామంలో ఆక్రమించారని, మంత్రిగా బాలినేని చేసిన అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 237 హెక్టార్లు అటవీ భూమిని ఆక్రమించిన బాలినేనిని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తన పార్టీలోకి చేర్చుకోవద్దని కోరారు. అలాంటి వారిని చేర్చుకుంటే జనసేన ప్రతిష్ఠ దెబ్బతింటుందని, డిప్యూటీ సీఎం ఒకసారి పరిశీలించాలని కోరారు. అలాగే డొక్కా సీతమ్మ అనే క్యాంటీన్ పెట్టి, పవన్‌కళ్యాణ్ మెప్పు కోసం బాలినేనికి కోవర్టుగా పనిచేస్తున్న అందరినీ మోసం చేస్తున్న జడ బాలనాగేంద్రయాదవ్ లాంటి వాళ్ళు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గౌరవాన్ని తగ్గించేలా మాట్లాడటం తగదన్నారు. దామచర్లపై నోరు పారేసుకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో రాజ్‌విమల్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సత్య ప్రత్యేక పూజలు


టంగుటూరు అంగాళపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న సత్య

టంగుటూరు, సెప్టెంబరు 25 : రాష్ట్ర పోర్టులు, హార్బర్ల నిర్వహణ (మారిటైం) బోర్డు చైర్మన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయన టంగుటూరులోని అంగాళపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మొలకలపల్లి శ్రీనివాసరావు, సూదలగుంట అనిత, షేక్ మాబు, అబ్బూరి అభిషేక్, వసుపులేటి రమేష్, జమ్ములపాలెం వెంకట్రావు ఉన్నారు. అనంతరం సత్య వల్లూరమ్మ దేవస్థానానికి చేరుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొజ్జా శ్రీనివాసరావు, మురళి, గోపి, వంశీ పాల్గొన్నారు.

పార్వతమ్మ మృతి బాధాకరం : మంత్రి స్వామి

టంగుటూరు, సెప్టెంబరు 25 : మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి బాధాకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. నాడు ఒంగోలు ఎంపీగా ఆమె జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పార్వతమ్మ మృతికి ఆయన సంతాపం తెలిపారు. పార్వతమ్మ మరణ వార్త తెలుసుకున్న మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల నరసిహారావు బుధవారం నెల్లూరులోని ఆమె గృహానికి చేరుకున్నారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నేత కసుకుర్తి శ్రీధర్ ఉన్నారు.

పురుగుల నిర్మూలనకు ఎరలు ఏర్పాటు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొండపి, సెప్టెంబరు 25 : పంటల్లో చీడపీడలు, పురుగుల నిర్మూలనకు ఎర (ట్రాప్)లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని తాటాకులపాలెం, చినకండ్లగుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడొద్దని సూచించారు. డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీని ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడీఏ రామ్మోహన్‌రావు, కేవీకే దర్శి శాస్త్రవేత్త రమేష్, వ్యవసాయాధికారులు శేషమ్మ, శైలజ, సింగరాయకొండ ఏడీఏ ఇ.నిర్మలకుమారి, కొండపి మండల వ్యవసాయాధికారి డి.విజయకుమార్, గ్రామ నాయకులు చాగం రెడ్డి నరసారెడ్డి, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

పొన్నలూరు (కొండపి), సెప్టెంబరు 25: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలోని విద్యార్థులకు బుధవారం చెకుముకి పోటీలు నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ వున్నం వెంకటరావు తెలిపారు. ఆయా స్కూళ్ల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు వచ్చేనెల 1న పొన్నలూరులోని జడ్పీ స్కూల్‌లో మండల స్థాయి పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో కత్తి శ్రీనివాసులు

సింగరాయకొండ, సెప్టెంబరు 25 : మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఆరు మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో కె.శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి, శారీరక ధృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ అశోక్‌బాబు, పీడీలు శంకర్‌రావు, ఎస్వీ ప్రసాద్, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.


17 మద్యం బాటిళ్లు స్వాధీనం.. ఇరువురి అరెస్ట్

టంగుటూరు, సెప్టెంబరు 25 : అక్రమంగా మద్యం బాటిళ్లతో ఉన్న ఇద్దరు వ్యక్తులను వేర్వేరుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 17 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక దక్షిణ బైపాస్ రోడ్డులో అనుమానంగా సంచరిస్తున్న జరుగుమల్లి మండలం వావిలేటిపాడుకు చెందిన నిడమనూరి సంజీవరావును పోలీసులు తొలుత పట్టుకున్నారు. ఆయన వద్ద ఉన్న అట్టపెట్టెలో మద్యం క్వార్టర్ బాటిళ్లు ఎనిమిది దొరికాయి. సాయంత్రం అదేప్రాంతంలో టంగుటూరుకు చెందిన పాలేటి కోటేశ్వరరావు తొమ్మిది బాటిళ్లతో పట్టుబడ్డాడు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను 2024-25 విద్యాసంవత్సరానికి భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధనా సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో, బోధనేతర సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని, ఈ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26నుంచి అక్టోబరు 10వ తేదీ ఉదయం వరకు దరఖాస్తులు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్ ద్వారా రూ.250 దరఖాస్తు రుసుం చెల్లించి సమర్పించాలన్నారు. ఆఫ్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తులు స్వీకరణ ఉండదని స్పష్టం చేశారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులు 18నుంచి 42 ఏళ్లలోపు, ఎస్సీఎస్టీ, బీసీ, ఈబీసీలకు ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. సబ్జెక్టుల వారీగా రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు, గౌరవ వేతనం, విద్యార్హతల వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు.

జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి


బీమా నగదును అందజేస్తున్న సర్పంచ్

కారుమంచి (టంగుటూరు) 25 : తపాలా జీవిత బీమాను ప్రజలంతా ఉపయోగించుకోవాలని ఆశాఖ ఒంగోలు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని కారుమంచిలో జనంలోకి మనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టాఫీసులో పొదుపు ఖాతాలు, వివిధ పథకాల గురించి రవికుమార్‌రెడ్డి వివరించారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన పి.సురేష్‌కు పోస్టాఫీస్ పొదుపు ఖాతా ద్వారా వచ్చిన బీమా నగదు మొత్తాన్ని ఆయన సతీమణి రమాదేవికి సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు ద్వారా అందించారు.

రోడ్డుపైన చెత్త తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కొండపి, సెప్టెంబరు 25 : కొండపి నుంచి జాళ్లపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. రోడ్డుపైకి వచ్చి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన వ్యర్థాలను పక్కకు నెట్టి వేశారు. 'రోడ్డుపైనే చెత్త.. వాహనదారుల అవస్థ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య ఆధ్వర్యంలో చెత్తను పక్కకు తొలగించారు.

కూటమి పాలన ప్రజారంజకం

పింఛన్ రూ.4వేలకు పెంచి ఒకటో తేదీనే ఇస్తున్నాం

సంక్రాంతి నుంచి కొత్త ఇళ్ల నిర్మాణాలు

యూనిట్ వ్యయం రూ.4లక్షలకు పెంపు

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు : మంత్రి స్వామి

కొండపి, సెప్టెంబరు 25 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలన ప్రజా రంజకంగా సాగుతున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇది మంచి ప్రభుత్వమని చెప్పడానికి వంద రోజుల పాలనే రుజువని పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్ పి.మురళి అధ్యక్షతన జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఒక్కరోజులోనే ఇంటివద్దనే అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు 14వ తేదీ ఇస్తే, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లు తెరిచి పేదల ఆకలి తీరుస్తున్నామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటన ద్వారా 16,300 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు మేలు చేశామన్నారు. సంక్రాంతి నుంచి ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో లబ్ధిదారులకు యూనిట్ వ్యయం రూ.4 లక్షలు పెంచుతున్నట్లు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో గృహాల నిర్మించుకొని బిల్లులు ఆగిపోయిన వారికి వాటిని చెల్లిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి అనర్హులైన పింఛన్ లబ్ధిదారులను తొలగించి అర్హులకు కొత్తవి మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పథకాలు విజయం : కలెక్టర్

ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి వారం 'మీకోసం' నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అంతకుముందు హైస్కూల్ ఎదురు బజారులోని పలు ఇళ్లకు మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా వెళ్లి గోడలకు 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను అంటించారు. యజమానులకు కరపత్రాలు అందజేశారు. సభలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, డీపీవో ఉషారాణి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ జె.రవిబాబు, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

సీహెచ్‌సీని తనిఖీ చేసిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సూచించారు. ఆయన బుధవారం కొండపిలోని సీహెచ్‌సీని కలెక్టర్ అన్సారియాతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా రోజువారీ వస్తున్న ఓపీలు, ఇన్‌పేషెంట్లు, వైద్యశాలలో వసతులు, మందులు, వైద్య పరీక్షల పరికరాలు తదితర విషయాలను డాక్టర్ వరలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో తాగునీటి ఫ్రిజ్ పనిచేయకపోవడాన్ని మంత్రి ప్రశ్నించారు. పలు గదుల వద్ద నీరు నిల్వ ఉండటాన్ని చూసి అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆతర్వాత నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ వైద్యాన్ని గడచిన వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం వైద్యశాలకు ఇద్దరు గైనకాలజిస్టులను డిప్యుటేషన్‌పై నియమించామన్నారు. మున్ముందు మరింత మంది సిబ్బంది, వైద్యులు వస్తారని చెప్పారు.


మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, అధికారులు

సీసీ రోడ్లు, సైడు కాల్వలకు శంకుస్థాపన

కొండపిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడు కాల్వలకు సచివాలయం ఆవరణలో శంకుస్థాపన చేశారు. స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

టంగుటూరులో..

టంగుటూరు : మండలంలోని జయవరంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు యరమోసు సుధాకర్‌బాబు మాట్లాడుతూ 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేసిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పేరమ్మ, పెద వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, పంచాయతీ సభ్యుడు భాస్కరరావు పాల్గొన్నారు.

సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం

గృహ లబ్ధిదారులకు బకాయిలు చెల్లిస్తాం

అయ్యపురాజుపాలెం సభలో మంత్రి స్వామి

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మర్రిపూడి, సెప్టెంబరు 25 : పేదల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. వంద రోజుల పాలనలోనే ఆ విషయాన్ని నిరూపించామని చెప్పారు. మర్రిపూడి మండలం అయ్యపురాజుపాలెంలో బుధవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అయ్యపురాజుపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులతో సర్వే నిర్వహిస్తామన్నారు. సంగమేశ్వర ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ప్రమాదభరితంగా ఉన్నాయని సర్పంచ్ కావ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొంతమంది సచివాలయ సిబ్బంది కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. అంతకు ముందు గంగవరపు పేరయ్య విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో సాంబశివరావు, ఐటీడీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, తుళ్లూరి నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, గంగవరపు మాధవ, గుట్లపల్లి కిరణ్, వై.వెంకటరెడ్డి, లెక్కల బాస్కర్, కొణిదెన మోహన్‌రావు, సర్పంచ్‌లు రాంబాబు, శివనారాయణ పాల్గొన్నారు.


సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి స్వామి

మన ఇల్లు-మనగౌరవంతో ఊరట

- జిల్లాలో 63,279 ఇళ్లు మంజూరు
- పూర్తిచేసింది 21,521 మంది లబ్ధిదారులు
- గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దే కార్యక్రమం అంటున్న పాలకులు
- లేఅవుట్ల వారీగా 28న ప్రభుత్వం అవగాహన సదస్సులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 25 : ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం పేదల నెత్తిన అప్పులు మిగిల్చింది. అస్మదీయులకు లబ్ధి చేకూర్చేందుకే ద్వారాలు తెరిచిందని పలువురు ఆరోపిస్తున్నారు. స్థలాల కేటాయింపు దగ్గర నుంచి బిల్లులు చెల్లింపులు జరిగిన అక్రమాలతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇలాగే వదిలేస్తే భవిష్యత్తులో కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు, నిధులు మంజూరుపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్ని పూర్తి చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అందులోను వచ్చే ఏడాది మార్చి వరకు మాత్రమే గడువు ఉంది. ఆ తర్వాత మంజూరైయ్యే ఇళ్లకు నిధులు వచ్చే అవకాశం లేదు. ఈలోగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం మన ఇల్లు-మనగౌరవం పేరిట లబ్ధిదారుల వద్దకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్థాయిలో ఏర్పాట్లు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నట్లు సంతనూతలపాడులో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఇన్‌చార్జ్ డీపీవో, మండల ప్రత్యేక అధికారి ఉషారాణి తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి జరగనున్న మన ఇల్లు-మనగౌరవం అవగాహన కార్యక్రమాలకు ప్రజాప్రతినిధుల సైతం హాజరవనున్నట్లు సమాచారం. ఆయా లేఅవుట్లలో నిర్వహించే సదస్సులను ఇన్‌చార్జ్‌లుగా నియమించిన అధికారులు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారు.

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మన ఇల్లు- మన గౌరవం పేరిట కొత్త కార్యక్రమం చేపడుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. తద్వారా పేదలకు న్యాయం చేయాలని భావిస్తోంది. లేనిపక్షంలో కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సాయానికి అవరోధం ఏర్పడే పరిస్థితిని గుర్తించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టింది.

మార్చి తర్వాత పీఎంఏవై 2.0

కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి తర్వాత పీఎంఏవై (ప్రధానమంత్రి ఆవాస్ యోజన) 2.0 కార్యక్రమం అమలు చేయనుంది. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు తీసుకున్న లబ్ధిదారులకు మళ్లీ కేటాయించే అవకాశం లేదు. ఉన్న స్థలంలోనే ఇళ్లు నిర్మించుకోవాలని, గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసుకోకుంటే బిల్లులు వచ్చే అవకాశం లేదు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు చెప్పడంతో పాటు, నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం లేఅవుట్లకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు.

మండలంలో సగం ఇళ్లే పూర్తి

గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 63,279 ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో పునాదుల స్థాయిలో 15,948 మంది అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. 21,521 మంది మాత్రమే నిర్మాణాలను పూర్తిచేశారు. 25,810 మంది కనీసం ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టలేదని గృహనిర్మాణాల సంస్థ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో నిధులుపరంగా 60 శాతం వినియోగించారు. మిగిలిన నిధులను రానున్న మార్చిలోగా వినియోగించుకోవాల్సి ఉంది.

అవకాశం వదులుకోవద్దు

ఉషారాణి, డీపీవో, మండల ప్రత్యేకాధికారి

ఇప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో నమోదైన కారణంగా భవిష్యత్తులో మరోసారి వారికి ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. అన్నిరకాల మౌళికసదుపాయాల కల్పన, ఇసుక, సిమెంటు, ఇనుము సరఫరా, సకాలంలో బిల్లుల చెల్లింపు చేస్తాం. ఆయా లేఅవుట్లకు సంబంధించిన అధికారులు అందరూ అందుబాటులో ఉంటారు. లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసుకోవాలి. అవసరమైన రుణాలు సైతం డీఆర్‌డీఏ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.


పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సింగరాయకొండ, సెప్టెంబరు 25 : పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.మహేంద్ర హెచ్చరించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధి చెల్లమ్మగారి పట్టపుపాలెంలో బుధవారం ఆయన ప్రజలతో సమావేశమయ్యారు. జూదంతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

30 వరకు ఇంటర్ రీ అడ్మిషన్లకు గడువు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 25: అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల గడువు ముగియగా రీ అడ్మిషన్లకు మాత్రం ఈనెల 30వ తేదీ వరకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకే అధికారం ఇచ్చారు. ఒక విద్యార్థి ఒక కళాశాలలో ఇంటర్ ప్రథమ లేక ద్వితీయ సంవత్సరం చదివి మళ్ళీ ఇంటర్‌లో అదే కళాశాల లేదా ఇతర కళాశాలలో అడ్మిషన్ కావాలంటే ఉచితంగా ప్రవేశం కల్పిస్తారన్నారు. ఒక విద్యార్థి ఒక కళాశాలలో చదువుతూ టీసీ తీసుకొని మరో కళాశాలలో చేరాలంటే రూ.1000 ఫీజు చెల్లించి చేరాలని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం రెగ్యులర్ లేదా ప్రైవేటుగా చదువుతూ ద్వితీయ బాష మార్చుకునేందుకు రూ.800 చెల్లించాలన్నారు. మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు రూ.600 చెల్లించి మీడియం మార్చుకోవచ్చని తెలిపారు. అలాగే రూ.1000 చెల్లించి గ్రూపు మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చారు. ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు గ్రూపు కాంబినేషన్‌ను మార్చుకునేందుకు కూడా అవకాశం ఇచ్చారన్నారు. ఫీజును యూనియన్‌బ్యాంకు చలానాల ద్వారానే చెల్లించాలని ఆర్ఐవో కోరారు.

సీఎం సహాయనిధికి టుబాకో అసోసియేషన్ విరాళం


సీఎంకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇండియన్ టుబాకో అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి రూ.50లక్షలు వరద బాధితులకు విరాళంగా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని వారు చెక్ రూపంలో ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్‌సుందర్, కోశాధికారి గుత్తా వాసుబాబు, ఇతర నాయకులు వైఏ చౌదరి, రమేష్‌బాబు, ఐటీసీ నుంచి వెంకటరామిరెడ్డి, వీఎస్‌టీ కంపెనీ నుంచి డాక్టర్ లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

జాళ్లవాగు కొత్తచెరువుకు గండి

మర్రిపూడి, సెప్టెంబరు 25 : మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జాళ్లవాగు కొత్తచెరువుకు గండిపడింది. తొలుత కొద్దిపాటి రంధ్రం కనిపించడంతో అన్నదాతలు దాన్ని పూడ్చేందుకు ఎక్స్‌కవేటర్‌తో ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. గండి పెద్దదై చెరువులోని నీరంతా వాగుపాలైంది.

జిల్లాలో వర్షపాతం 33.0 మి.మీ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 33.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదిలి మండలంలో 104.6 మి.మీ కాగా అత్యల్పంగా సంతనూతలపాడు మండలంలో 3.0 మి.మీ నమోదైంది. మార్కాపురం మండలంలో 77.6, కంభం 75.4, కొనకనమిట్ల 74.6, బేస్తవారపేట 73.4, దర్శి 73.2, తర్లుబాడు 61.4, మర్రిపూడి 57.2, దొనకొండ 55.0, సిఎస్‌పురం 52.4, కురిచేడు 49.0, కొమరోలు 44.2, సింగరాయకొండ 38.8, ముండ్లమూరు 36.2, తాళ్లూరు 31.2, పిసిపల్లి 29.0, పామూరు 27.8, పెద్దారవీడు 24.8, కనిగిరి 21.4, గిద్దలూరు 21.0, చీమకుర్తి 19.6, కొత్తపట్నం 18.6, దోర్నాల 17.8, వెలిగండ్ల 17.2, జరుగుమల్లి 16.8, అర్ధవీడు 16.2, మద్దిపాడు 16.2, పొన్నలూరు 15.4, నాగులుప్పలపాడు 14.8, కొండపి 13.2, టంగుటూరు 12.2, త్రిపురాంతకం 11.4, హనుమంతునిపాడు 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది.



పెద్దనాగులవరంలో 'పొలం పిలుస్తోంది'లో అధికారులు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

● 'పొలం పిలుస్తోంది'లో అధికారులు

మార్కాపురం రూరల్ : పంటల సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెద్ద నాగులవరం, నికరంపల్లి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం అధికారులు, రైతులతో కలిసి నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న వరి పైరును పరిశీలించారు.

● తర్లుపాడు : మండలంలోని నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లెలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు కంది, వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం కంది పంటపై పెంకి పురుగు వ్యాపిస్తుందని, దీని నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు సూచించారు.

● పొదిలి : అన్నదాతలు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని దర్శి వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ అన్నారు. 'పొలం పిలుస్తుంది'లో భాగంగా బుధవారం మండలంలోని ఆముదాలపల్లి, అన్నవరం గ్రామాల్లో పాల్గొని సాగు పద్ధతులు వివరించారు.

● పెద్ద దోర్నాల : ప్రస్తుతం మిరప, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు, పెద్దబొమ్మలాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

● పుల్లలచెరువు : రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించు కోవాలని పుల్లలచెరువు మండల వ్యాసాయశాఖ అధికారి పి.నిర్మలాదేవి అన్నారు. బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మానేపల్లి, తెల్లగట్ల గ్రామాల్లో వరి సాగును పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు.

● త్రిపురాంతకం : మండలంలోని గుట్లపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆద్వర్యంలో అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వరి నాట్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో కె.నీరజ మాట్లాడుతూ వరిసాగులో అనుసరించాల్సి పద్ధతులు, సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

పోలీసుల అదుపులో జూదరులు

గిద్దలూరు టౌన్ : మట్కా ఆడుతున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన గిద్దలూరు పట్టణ సమీపంలో జరిగింది. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వెళ్లే రహదారి అభిరుచి హోటల్ దగ్గర మట్కా ఆడుతున్న ఇద్దరిని అర్బన్ సీఐ కె.సురేష్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం : పాముల

గిద్దలూరు టౌన్ : పట్టణంలో పలు ప్రాంతాల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం 9వ వార్డులో గల అమ్మవారిశాల వీధిలో నీటి కొరత ఏర్పడిందని తెలుసుకుని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి ఆ ప్రాంత ప్రజలు తెలుపగా వెంటనే స్పందించి నూతన బోరును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు డీప్‌బోరు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేశారు.

మాజీ సైనికుల విరాళం

గిద్దలూరు టౌన్ : విజయవాడ వరద బాధితులకు కంభం మాజీ సైనిక ఉద్యోగులు రూ.1.30 లక్షల చెక్కును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి బుధవారం విరాళంగా అందజేశారు. గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో కంభం మాజీసైనికుల సంఘం నాయకులు ఎస్.వేణుగోపాల్, సి.హెచ్.పుల్లయ్య, ఎన్.పోలయ్య, జి.అంకయ్య, జె.బాలక్రిష్ణ, కె.రంగయ్య, ఎ.పాండురంగయ్య, కె.చిన్నయ్య, బి.చెన్నకేశవులు, మస్తాన్‌వలి చెక్కును అందచేశారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న కంభం మాజీ సైనికులు

చెకుముకి సైన్స్ సంబరాలు

గిద్దలూరు : జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పొదలకొండపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు.

● కొమరోలు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్సు సంబరాల సందర్భంగా విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

మార్కాపురం : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యంవైపు ముందుకు సాగాలని ఐఐటీ కలకత్తాకు చెందిన ఐటీ బిజినెస్ అండ్ టెక్నాలజీ లీడర్ గుండాల నాగరాజు అన్నారు. స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డేటా సైన్స్ మిషన్ లెర్నింగ్ ప్రాముఖ్యత అనే అంశాలపై విద్యార్థులకు సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మీర్జా మహ్మద్ మసూద్ అలీబేగ్, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయం రికార్డుల పరిశీలన

గిద్దలూరు : రాచర్లలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఒంగోలు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పీరయ్య సహకారంతో 10వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు మెంబర్ షిప్‌లను ఉచితంగా అందించారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ గిద్దలూరు ఏడీఈ బాలాజీనాయక్



దోర్నాల సమీపంలో మిరప నాట్లు వేస్తున్న కూలీలు

సాగు ముమ్మరం

● విస్తారంగా మిరప నాట్లు, సస్యరక్షణ చర్యలు ● కూలీలు దొరక్క పత్తి తీతకు రైతుల అవస్థ

పశ్చిమ ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే వేసిన పంటలు జీవం పోసుకున్నాయి. ఇన్నాళ్లూ ఎండల దాటికి బెట్టకొచ్చిన పంటలు మళ్లీ కుదురుకుంటున్నాయి. మొత్తంగా రైతుల కళ్లలో ఆనందం నిండుతోంది. క్షణం తీరిక లేకుండా సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 25 : మండలంలో వ్యవసాయ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇన్నాళ్లుగా వర్షాలు లేక దుక్కులు చేసి పంటల సాగులేక రైతులు, కూలీలు నిస్తేజంలో ఉన్నారు. పది రోజులు కిందట కురిసిన మోస్తరు వానకు చేలు పదునెక్కాయి. నల్లమలలో కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహించాయి. చెరువులు నిండాయి. దీంతో బోరుబావుల్లో నీళ్లొస్తాయని ఈ ఏడాది పాటు సాగు సజావుగా ఉంటుందనే భావనలో రైతులు మిరప నాట్లు వేశారు.

సస్య రక్షణ చర్యలు..

తీగలేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని బోర్లకు కొద్ది నీరు వస్తోంది. ఇటీవల వరకూ 70 శాతం బోర్లకు భూగర్భ జలాలు పెరగలేదు. వేసవిని మించిన ఎండలు, వడ గాలులతో మిరప మొక్కలు చనిపోతాయని రైతులు ఆందోళన చెందారు. రెండ్రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, వానలు కురుస్తుండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్త పరుస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు మిరప చావు నాట్లు వేస్తుండగా, మరికొందరు కలుపులు తీస్తున్నారు. ఇంకొందరు అంతరసేద్యంతో పాటు పైపాటుగా మందులు పిచికారీ చేస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పెరిగి తగ్గిన పత్తి ధరలు

మండలంలో ఈ ఏడాది పత్తి సాగు కొంచెమే అయినా తెగుళ్ల బెడద లేని కారణంగా దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దానికితోడు ధరలు కూడా తొలి నాళ్లలో క్వింటాలు ధర రూ.5,000 నుంచి రూ.5,300 వరకు పలికింది. పది రోజుల నుంచి అనూహ్యంగా ధరలు పెరిగి క్వింటాలు రూ.7000 వరకు అమ్మకాలు జరిగాయి. రెండు రోజులుగా చిరు జల్లులు కురుస్తుండడంతో వర్షం సాకుతో మళ్లీ క్వింటాలు ధర రూ.5,000 నుంచి రూ.5200కు తగ్గించేశారు. మండలంలో ఎక్కువగా గంటవానిల్లె, తిమ్మాపురం, యడవల్లి, చెర్లోపల్లి, నల్లగుంట్ల, పెద్ద బొమ్మలాపురం గ్రామాల్లో పత్తిని సాగు చేశారు. పత్తి తీతలు, మిరప, పొగాకు నాట్లు, కలుపుల వల్ల కూలీల కొరత ఏర్పడింది.

వర్షంతో పంటలకు జీవం

కంభం : అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కంభం, అర్ధవీడు మండలాల్లోని పలు పంటలకు జీవం పోసినట్లయింది. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో పశ్చిమ ప్రకాశంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో పత్తి, మిర్చి, పొగాకు, కంది, వరి, తదితర పంటలు బెట్టకొచ్చాయి. వ్యవసాయ బోర్ల ద్వారా పంటలకు చాలీచాలని తడులను అందిస్తూ పంటలను బతికించుకుంటున్న రైతులు వర్షాలు కురవాలని ఎదురుచూస్తున్న తరుణంలో సోమ, మంగళ వారాల్లో కురిసిన వర్షాలకు పంటలకు జీవం పోసినట్లయింది. 75.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు గిద్దలూరు వ్యవసాయశాఖ ఏడీఈ బాలాజీనాయక్ తెలిపారు.

పొంగిన వాగులు.. నిండిన చెరువులు

మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి, మార్కాపురం మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో చాలాచోట్ల వాగులు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువుల్లో నీరు చేరింది. కంభం, బేస్తవారిపేట మండలాల్లో కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ నది పారింది. గుండ్లకమ్మ నది నుంచి సప్లై చానల్ ద్వారా మార్కాపురం చెరువుకు నీరు చేరింది. తర్లుపాడు మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లి, కారుమానుపల్లి గ్రామాల్లో కురిసిన వర్షానికి తర్లుపాడు చెరువుకు నీరు చేరింది. సీతానాగులవరం సమీపంలో మార్కాపురం-తర్లుపాడు రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెట్ట పంటలకు బుధవారం కురిసిన వర్షం జీవం పోసినట్లైంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

● బట్టువారిపల్లి గ్రామస్థుల సాయంతో ఒడ్డుకు చేరిన ప్రయాణికులు

పొదిలి : అనుకోకుండా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పొదిలి - మార్కాపురం ప్రధాన రహదారి బట్టువారిపల్లి గ్రామం వద్ద ఉన్న వాగులో నీటి ఉధృతి పెరిగి వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పొదిలి నుంచి మార్కాపురం వస్తున్న సూపర్ లగ్జరీ బస్సు నీటిలోకి దిగడంతో బస్సు సగం వరకు నీళ్లొచ్చాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపేశారు. ప్రయాణికులను దింపి గ్రామస్థుల సహాయంతో ఒడ్డుకు చేరారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

సమాచారం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో బస్సును ఒడ్డుకు చేర్చారు. వాగు ఉధృతి తగ్గేవరకు పొదిలి-మార్కాపురం మధ్య రాకపోకలను నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా చినారికట్ల జంక్షన్ మీదుగా రాకపోకలు మళ్లించారు.

సమస్యల్లేని గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



యాచవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, సెప్టెంబరు 25 : వైసీపీ పాలకులు ఐదేళ్లపాటు గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి ఏం చేయాలో తెలుసుకుని గ్రామసభల్లో తీర్మానం చేసేలా శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా అర్ధవీడు మండలం యాచవరంలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్న ఎమ్మెల్యే, గ్రామంలో ఏర్పాటు చేయనున్న గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం గ్రామాలకు కల్పతరువు లాంటిదని, గ్రామపంచాయతీల నిధులను మళ్లించి జగన్‌రెడ్డి గ్రామాలను నాశనం చేశాడని అన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి వంద రోజుల పాలనను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి పీరయ్య, ఎంపీడీవో జగదీష్, తహసీల్దార్ విజయ్‌కుమార్, జడ్పీటీసీ చెన్ను విజయ, పార్టీ మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు, బోయపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వందరోజుల్లో రూ.15 కోట్లతో రోడ్లు మంజూరు

● వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ.15 కోట్లతో సీసీ రోడ్డులు మంజూరు అయ్యాయని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని సుంకేసులలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఎంపీడీవో రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. నిర్వాసిత గ్రామాలైన సుంకేసుల, గుండంచర్ల గ్రామాలకు రూ.51 లక్షలతో నూతన రోడ్ల నిర్మాణానికి అనుమతులు లభించాయని ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆయా గ్రామాల్లోని మెటల్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడి వెలిగొండ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఎర్రగొండపాలెం ఎస్సీ హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గెడ్డేపోగు రమేష్, ఎంపీటీసీ అబ్రవతి, తహసీల్దారు శైలేంద్ర కుమార్, ఎంఈవోలు శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

● **చిన్నగుడిపాడులో...**

పెద్ద దోర్నాల : మండలంలోని చిన్నగుడిపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం

కొమరోలు : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఆరింటిని వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసి మాట నిలబెట్టుకుందని టీడీపీ నాయకులు ముత్తుముల యల్లారెడ్డి, బద్రి లక్ష్మీరంగారెడ్డి అన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామ పంచాయతీలోని బాదినేనిపల్లి, క్రిష్టంపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో బుదవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాదర్శి బండి కారుణ్య, రేపల్లి వెంకట నరసయ్య, జాను పాల్గొన్నారు.



క్రిష్టంపల్లిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఎరువుల దుకాణాలపై దాడి

● 2 షాపులపై 6ఏ నమోదు ● రూ.1.45 లక్షల విలువైన స్టాక్ సీజ్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 25 : పట్టణంలోని పలు దుకాణాలపై ఒంగోలుకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి దాడులు చేపట్టారు. రెండు దుకాణాల్లో స్టాక్ సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. పట్టణంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్, చీతిరాల నాగేశ్వరరావు ఎరువుల దుకాణాలపై బుధవారం రాత్రి ఒంగోలుకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బి.రామారావు, ఎన్.రాఘవరావు, జి.నాగేశ్వరరావు, స్థానిక వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి మూకుమ్మడి దాడి నిర్వహించారు. ఆయా షాపుల్లో యూరియా ఎరువులు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గమనించి కేసు నమోదు చేశారు. శ్రీకృష్ణ ట్రేడర్స్‌లో రూ.1,03,135 విలువ గల 387 యూరియా బస్తాలను, చీతిరాల నాగేశ్వరరావు షాపులో రూ.42,640 విలువైన 160 సంచుల యూరియాను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం మెరుగు

మార్కాపురం రూరల్ : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగవుతుందని తల్లులకు, గర్భిణులకు ఐసీడీఎస్ సీడీపీవో బి.సుశీలాదేవి తెలిపారు. మండలంలోని వేమలకోట పంచాయతీ పరిధిలోని బెస్తకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.

రక్త వర్గీకరణ పరీక్షలపై అవగాహన

పెద్ద దోర్నాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్త వర్గీకరణ పరీక్షలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో మార్కాపురానికి చెందిన సాయి లక్ష్మీ ల్యాబ్స్ ఎంఎల్‌టీ వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ బ్లడ్ గ్రూపుల గురించి తెలుసుకోవాలన్నారు. రక్త దానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత మెడికల్ క్యాంప్

కంభం : స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ముబీనా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇస్మాయిల్, ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, చైర్మన్ రావూరి జనార్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం స్థానిక దేవిభాస్కర్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని పొట్టిసుబ్బయ్య రూ.10,116 ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు.

ఫ్రీహోల్డ్ భూముల విచారణ పారదర్శకంగా జరగాలి



రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న స్పెషల్ సబ్ కలెక్టర్ సత్యనారాయణ

తర్లుపాడు, సెప్టెంబరు 25 : తర్లుపాడు మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై విచారణ పారదర్శకంగా చేపట్టాలని స్పెషల్ సబ్ కలెక్టర్ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూములపై వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 16 పంచాయతీల్లో 5,278 ఎకరాలు ఫ్రీహోల్డ్ భూములున్నట్టు గత ప్రభుత్వం ప్రకటించింది. ఈ భూములకు సర్వ హక్కులు రావటంతో కొంతమంది అనర్హులు వేగవంతంగా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే 94 మంది రైతులు 198 ఎకరాలకు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల ఫ్రీహోల్డ్ భూములపై విచారణ చేయాలని ఆదేశించటంతో పరిశీలనకు వచ్చామని స్పెషల్ సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ భూములపై క్షణ్ణంగా పరిశీలించి నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

సత్తాచాటిన తాడివారిపల్లె విద్యార్థులు



ప్రతిభ కనబర్చిన తాడివారిపల్లె విద్యార్థులు

తర్లుపాడు : మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో మండలంలోని తాడివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 100 మీటర్ల అండర్-17 పరుగు పోటీల్లో, 1500 మీటర్ల పరుగు పోటీల్లో ఎస్.అశోక్, హేమావతి ప్రథమ స్థానం సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎం.భానుశ్రీ ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అజీమ్ బాషా తెలిపారు.

ఆలయ పనుల ఖర్చు ప్రతిపైసా లెక్కే

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చేసిన అభివృద్ధి పనులకు ప్రతిపైసా లెక్క ఉందని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పెనుగొండ కేశవరావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో 4 ప్రాకార గోపురాలు, రంగనాయక స్వామి, ఆంజనేయ స్వామి, ఆండాళ్ అమ్మవారి ఆలయాలు, భేరీ మండపం నిర్మాణాల కోసం భక్తుల వద్ద నుంచి విరాళాలు సేకరించామన్నారు. తాను ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆలయ అభివృద్ధి కోసం దాదాపు రూ.11 కోట్లు అంచనా వేసి దాతల నుంచి విరాళాలు సేకరించామన్నారు. రూ.8 కోట్లకుపైగా దాతల వద్ద నుంచి రాగా రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రూ.కోటికి పైగా అవసరం ఉందని, విరాళాలు హామీలు ఇచ్చిన భక్తుల నుంచి ఇంకా డబ్బులు వసూలు చేయాల్సి ఉందని అన్నారు. తమపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేయడం విచారకరమని అన్నారు. ఈ సమావేశంలో సూరె సురేంద్ర, పిన్నిక చక్రపాణి, గోపాలుని హరిహరరావు, సుబ్రహ్మణ్యం, నారాయణం రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన సభ



విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం

పొదిలి : 2024 - 2025 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కేజీబీవీలో అభినందన సభ ఏర్పాటు చేశారు. బుధవారం ఎంఈవో శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. గత సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, రెండో సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మార్కాపురం రామభూపాల్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 నాగలక్ష్మీ, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనురాధ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు మీదుగా ప్రత్యేక రైలు

గిద్దలూరు : యశ్వంత్‌పూర్ నుంచి భువనేశ్వర్‌కు గిద్దలూరు మీదుగా దసరా, దీపావళి పర్వదినాలను పురష్కరించుకుని ప్రత్యేక రైలు సర్వీసులను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే షెడ్యూలు విడుదల చేసింది. భువనేశ్వర్ నుంచి అక్టోబరు 5, 12, 19, 26 తేదీల్లో, నవంబరులో 2, 9, 16, 23, 30 తేదీల్లో 02811 నెంబరుతో ప్రత్యేక రైలు బయలుదేరుతుందని, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్ నుంచి 02812 నెంబరుతో అక్టోబరులో 7, 14, 21, 28 తేదీల్లో, నవంబరులో 4, 11, 18, 25 తేదీల్లో, డిసెంబరులో 2వ తేదీన ఈ రైలు తిరుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక రైలు ఆయా తేదీలలో గిద్దలూరుకు మధ్యాహ్నం 12.20 గంటలకు వచ్చి యశ్వంత్‌పూర్‌కు వెళుతుందని, తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.05 గంటలకు గిద్దలూరు వచ్చి భువనేశ్వర్‌వైపు వెళుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

మార్కాపురంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న కృష్ణారావు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితను కలిసి విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ప్రకాశంలో నెలకొన్న సమస్యలు వివరించారు. మార్కాపురం పట్టణం, డివిజన్ పరిధిలో బీసీ హాస్టల్‌లో సరైన వసతులు లేవని బాలబాలికలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

పోటీ పరీక్షల్లో పాల్గొనాలి

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని మేధస్సుకు మరింత పదును పెట్టాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు బుధవారం వివిధ పాఠశాలలో నిర్వహించారు. జెడ్పీ బాలికల, నారాయణ టెక్నో స్కూల్, కమలా హైస్కూల్, సాయి బాలాజీ పాఠశాల, వాసవి పాఠశాల, సాయి చైతన్య పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులదే కీలకపాత్ర

మార్కాపురం, సెప్టెంబరు 25 : ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులదే కీలకపాత్ర అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అన్నారు. స్థానిక బీసీ భవన్ ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జార్జి ఫార్మసీ కళాశాలలో పనిచేస్తున్న దంపతులైన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీకాంత్, ప్రొఫెసర్ సునీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు రంగస్వామిగౌడ్, బీసీ భవన్ కమిటీ అధ్యక్షుడు గోసు సుబ్బారావు, కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం

● ఎరిక్షన్ బాబుకు రూ.6.30 లక్షల చెక్కు అందజేత

పుల్లలచెరువు : విజయవాడ వరద బాధితల కోసం పుల్లలచెరువు మండల టీడీపీ నాయకులు అపన్నహస్తం అందించారు. బుధవారం పుల్లలచెరువు మండల టీడీపీ ఆధ్వర్యంలో వైపాలెంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు బాబుకు కలిసి రూ.6.30 లక్షల రూపాయల చెక్కును ఆయనకు అందజేశారు.



రెవెన్యూ కార్యాలయంలో
రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

పెండింగ్ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ముండ్లమూరు, సెప్టెంబరు 25 : మండలంలో పేరుకుపోయిన పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోలంకి గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు భూ సమస్యల పెండింగ్ రికార్డులను పరిష్కరించారు. మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మండల కార్యాలయంలోనే సమస్యలు పరిష్కరిస్తే జిల్లాలో జరిగే మీ కోసం స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారులు రాకుండా ఉంటారన్నారు. మండలంలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ సర్వేను చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. భూముల రికార్డుల్లో తప్పులు దొర్లకుండా చూడాల్సిన అవసరం రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ పని తీరు పట్ల జాయింట్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు



సమాచార హక్కుచట్టం గురించి
వివరిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

సహచట్టంతో సమాచారం పొందే హక్కు

● తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, సెప్టెంబరు 25 : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కావాల్సిన సమాచారం పొందేందుకు సమాచార హక్కు చట్టాన్ని 2005లో ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తహసీల్దార్ బి. రమాదేవి వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎటువంటి సమాచారాన్ని అయినా ఆయా కార్యాలయాలకు దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో సర్టిఫైడ్ కాపీతో పొందవచ్చని తెలిపారు. ఎంపీడీవో వసంతరావునాయక్, వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, ఏపీవో టి. దేవయ్య, హౌసింగ్ ఏఈ హనుమంతరావులు సమాచార హక్కు చట్టానికి సంబంధించిన అనేక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి



బీఓబీ శాఖను ప్రారంభిస్తున్న జేసీ

దర్శి, సెప్టెంబరు 25 : బ్యాంకింగ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి ప్రజలందరికీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. దర్శిలో బ్యాంక్ అఫ్ బరోడా నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు ప్రజలకు విరివిగా రుణాలు అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో అమలు జరిగేలా బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. దర్శిలో నూతనంగా అనేక బ్యాంక్‌లు ఏర్పాటు కావటం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బరోడా బ్యాంక్ రీజనల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డీఎస్పీ పి. లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎం. శ్రావణ్ కుమార్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

టీడీపీ నేత వెంకటరామిరెడ్డి మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే ఉగ్ర

వెలిగండ్ల : సెప్టెంబర్ 25 : మండలంలోని పందువ నాగులవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేసరి వెంకట రామిరెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకట రామిరెడ్డి మృతికి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు నివాళులు అర్పించిన వారిలో నియోజకవర్గ టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి, గొనా ప్రతాప్, కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, షేక్ షరీఫ్, చిలకల వెంకటేశ్వర్లు, కర్నాటి భాస్కర్ రెడ్డి, యోరువ చెంచిరెడ్డి కొండు భాస్కర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కనిగిరి, సెప్టెంబరు 25: పట్టణ శివారులోని గార్లపేట రోడ్డు సమీపంలో పేకాటస్థావరంపై ఎస్ఐ శ్రీరాం తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి జూదరులను కోర్టుకు హాజరుపరుచనున్నట్లు ఎస్ఐ బుధవారం తెలిపారు.

ఎన్నికల బిల్లులు

వచ్చేది ఎప్పటికో ?



- అప్పటి అధికారులంతా బదిలీ
- మాకు సంబంధంలేదంటున్న కొత్తవారు
- మెటీరియల్, ఫర్నిచర్ మాయం
- దిక్కుతోచని స్థితిలో నిర్వాహకులు
- విచారణ జరపాలని డిమాండ్

గత ఎన్నికల్లో వివిధ పనులు నిర్వహించిన వారు ఇంకా బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలలు అయినప్పటికీ లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. నాడు ఎన్నికలు నిర్వహించిన అధికారులు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన అధికారులు ఆ బిల్లుల తో తమకు సంబంధం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసిన నిర్వాహకులు ఎవరిని అడగాలో, బిల్లులు ఎలా తెచ్చుకోవాలో అర్థంకాక అల్లాడుతున్నారు.

దర్శి, సెప్టెంబరు 24 : దర్శి నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా పలువురు వ్యాపారులు ఎన్నికల సిబ్బందికి, అధికారులకు ఇతర అవసరాలకు భోజనాలు సరఫరా చేశారు. పలువురు స్టూడియో నిర్వాహకులు, వీడియోలు ఫొటోలు తీశారు. మరి కొంతమంది వ్యాపారులు షామియానాలు ఫర్నిచర్ సమకూర్చారు. సిబ్బంది రోజుల తరబడి ఎన్నికల విధులు నిర్వహించారు. వీరందరికీ ఇంకా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. ఎన్నికల అనంతరం వీరికి కొంతమేర బిల్లులు ఇచ్చారు. ఎన్నికల ఫండ్ పూర్తిగా రాలేదని, వచ్చిన తర్వాత బకాయిలు చెల్లిస్తామని ఎన్నికలు నిర్వహించిన అధికారులు చెబుతూ వచ్చారు. కొద్ది రోజులకు రిటర్నింగ్ అధికారి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి వెళ్లిపోయారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత నిర్వాహకులు కొత్త అధికారులు వస్తే బిల్లులు ఇస్తారని ఆశతో ఎదురుచూశారు. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన అధికారులను కొద్దిరోజుల క్రితం బకాయిలు ఇవ్వాలని నిర్వాహకులు అడగ్గా ఎన్నికల బిల్లులతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు రావాల్సిన నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల బిల్లులు గతం కంటే అధికంగానే వచ్చాయి. అయినప్పటికీ బకాయిలు ఎందుకివ్వలేదో అర్థంకావడం లేదు. ఎన్నికల వ్యయం కింద ప్రభుత్వం దర్శి నియోజకవర్గానికి రూ.1.80 కోట్లు నిధులు విడుదల చేసినట్లు సమాచారం. బదిలీ అధికారులను ఎన్నికల బిల్లుల వివరాలు అడగ్గా ఆ మేరకు విడుదల అయినట్లు చెప్పారు. అంత పెద్ద మొత్తంలో నిధులు విడుదలైనప్పటికీ బకాయిలు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహించిన అధికారులు వెళ్లటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పెట్టుబడి పెట్టిన నిర్వాహకులు మామూలుగా డబ్బులు రావాలనే ఉద్దేశంతో న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు.

ఫర్నిచర్ స్వాహా

ఎన్నికల సందర్భంగా అవసరాల కోసం కొలుగోలు చేసిన ఫర్నిచర్ కూడా మాయమైంది. బదిలీపై వెళ్లిన కొంతమంది అధికారులు ఫర్నిచర్‌ను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ అధికారులు ఇతర అధికారులు వచ్చినప్పుడు సదుపాయం కోసం కొత్త ఏసీలు కొనుగోలు చేసి బంగ్లాలో బిగించారు. మరికొంత ఫర్నిచర్ కూడా కొనుగోలు చేశారు. అదనపు కంప్యూటర్లు ఇతర సామాగ్రి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ ఏసీలు, కొంత మెటీరియల్ కనిపించటం లేదు. ఉద్దేశపూర్వకంగా ఏసీలను ఒక అధికారి తీసుకెళ్లినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ ఏసీలు ఏమయ్యాయని సిబ్బంది ప్రశ్నించగా మరమ్మతుల కోసం తీసుకెళ్లారని చెబుతున్నారు. కొత్త ఏసీలు మరమ్మతులకు రావటం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ మరమ్మతులకు తీసుకెళ్తే నెలలు గడుస్తున్నా తిరిగి బిగించలేదు. ఉద్దేశపూర్వకంగా ఏసీలను, మెటీరియల్ తీసుకెళ్లినట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఎన్నికల నిధుల గోల్‌మాల్‌పై, మెటీరియల్ మాయంపై విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో
మాట్లాడుతున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, సెప్టెంబరు 25 :సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రెండింటికి సమాన ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తాళ్లూరులో ఎంపీడీవో కార్యాలయం వద్ద స్థానిక ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం సంక్షోభం నుంచి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదన్నారు. గొట్టిపాటి కుటుంబం నిత్యం ప్రజలకోసం పరితపించే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. దర్శిలో ఇటీవల జాబ్ మేళాను నిర్వహించి 587 మంది యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు.దర్శి ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణకై ప్రత్యేక దృష్టిసారించి ఆరోగ్యశిబిరాలు, కంటి వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, చివరకు పవిత్ర తిరుపతి లడ్డూల విషయంలో కూడా కల్తీ చేసి ప్రజల మనోభావాలనుదెబ్బతీశారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఒక్క అడుగు ముందుకు పడని తాళ్లూరు-తూర్పుగంగవరం డబుల్‌రోడ్డు నిర్మాణం, సాగు నీటి కోసం మొగలిగుండాల రిజర్వాయర్,133/32 విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ 5 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. విజన్ ఉన్న నేత సీఎం చంద్రబాబు 100 రోజుల పాలనలో అనేక అవరోధాలు వస్తున్నా అటుసంక్షేమానికి, ఇటు అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. ముందుగా మండలకాంప్లెక్స్ వద్దగల ఎన్టీఆర్ విగ్రహాని పూలమాల వేసి నివాళులు అర్పించారు. విగ్రహం వద్ద టీడీపీపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు ఇడమకంటి శ్రీనివాసరరెడ్డి, టీడీపీ మాజీ అధ్యక్షులు ఐ.వి.రమణారెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శులు వల్లభనేని సుబ్బయ్య, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర టీడీపీ మైనారిటిసెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి,రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, పిన్నిక రమేష్, పలుగ్రామాలకు చెందిన టీడీపీ, బీజేపీ,జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

రైతులకు కూటమి ప్రభుత్వం అండ

రైతులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధశాఖల స్టాల్స్‌ను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాని పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ముందుగా పొలంబడి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఐవీ రమణారెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, పెదకాలేషా, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఓట్ల రివిజన్ ప్రక్రియ వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న
నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు

దర్శి, సెప్టెంబరు 25 : ఓటర్ల రివిజన్ ప్రక్రియ వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నుంచి సెప్టెంబరు 21వ తేదీ వరకు వచ్చిన క్లయిమ్‌లను నిష్పక్షపాతంగా పరిశీలించి ఓటు హక్కు కల్పించాలన్నారు. పోలింగ్ బూత్‌లో 1500కి మించి ఓట్లు ఉన్నవాటిని గుర్తించి విభజన చేయాలని సూచించారు. ఓటర్ల రివిజన్ కార్యక్రమం నిరంతరం జరుగుతోందని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రభుత్వ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి టి. రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి నెలాఖరు లోపు నిర్మాణంలో ఉన్న గృహాలన్నీ పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి అందరూ ఇళ్లు నిర్మించుకునే విధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబించిన అధికారులపై చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. కుసుమకుమారీ, ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు, గృహనిర్మాణ శాఖ ఏఈ షేక్ షాకీర్‌బాష, ఏపీవో కల్యాణి, ఇంజనీరింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి



దేకనకొండ గ్రామంలో రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు

కురిచేడు, సెప్టెంబరు 25: ప్రభుత్వ రాయితీలను రైతులు వినియోగించుకుని లాభం పొందాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బయ్యవరం, పెద్దవరం, దేకనకొండ గ్రామాలలో రైతుల పంట పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యం పరికరాలు ప్రభుత్వ రాయితీపై ఇస్తున్నారని, రైతులు వాటిని వినియోగించుకోవాలని ఎంఐఏవో కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేకనకొండ బీఏఏ షేక్ అమ్మద్దీన్, పెద్దవరం ఏఏఏ సౌమ్యలత, రైతులు పాల్గొన్నారు.

పొదిలిలో

పామూరు : రైతులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఏవో కే రాధ కోరారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి, గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, అనుబంధశాఖల ద్వారా అమలు జరిగే వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం రావిగుంటపల్లి రైతులకు వీబీఎన్ -8 రకం మినుము విత్తనాలను 15. 20 కింటాళ్లు, వగ్గంపల్లి రైతులకు 17.68 క్వింటాళ్ల త్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, ఉద్యానశాఖ హెచ్‌వో కుసుమ కుమారి, వీఏఏ పి. శ్రీనాథ్, పశుసహాయకులు, మార్కెటింగ్ శాఖ, వీఆర్వోసచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలాజీకి పలువురి అభినందనలు

దొనకొండ, సెప్టెంబరు 25 : రాష్ట్ర టూరీజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీని బుధవారం ఒంగోలులో దొనకొండ మండలానికి చెందిన పలువురు కలిసి పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా అభినందించారు. దర్శి ఏఎంసీ మాజీ చైర్మన్ రావగొర్ల వెంకటయ్య, రాజ్యలక్ష్మి ఏజెన్సీ ప్రతినిధి బొరిగొర్ల వెంకటేశ్వర్లు, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరామయ్య, ఆయన అభిమానులు బత్తుల శ్రీనివాస్, కటారి వెంకటేష్ మరికొందరు కలిసి అభినందించారు. జిల్లా పరిషత్ కోప్షన్ మాజీ సభ్యుడు, మండల టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ మగ్బూల్ అహమ్మద్ జిల్లా నుంచి చైర్మెన్లుగా ఎంపికైన దామచర్ల సత్య, నూకసాని బాలాజీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు, సెప్టెంబరు 25 : మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఏ హనుమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన త్రిపురాంతక మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పని చేస్తూ బదిలీపై ముండ్లమూరు మండలానికి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన హనుమాన్ బాబు డీఈ శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో తాగు నీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే చెకుముకి

● ఎంఈవో నారాయణరెడ్డి



చెకుముకి ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

కనిగిరి, సెప్టెంబరు 25: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతో దోహద పడుతుందని ఎంఈవో యూవీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం చెకుముకి ప్రశ్నప్రత్రాలను ఎంఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు చెకుముకి ఉపయోగపడుతుందన్నారు. . పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు అక్టోబర్ 1వ తేదీ జరిగే మండల స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొనాలని జేవీవీ నాయకులు వీ మాలకొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో బ్రహ్మారెడ్డి, లింగారెడ్డిపల్లి హైస్కూల్ హెచ్ఎం మాధవశర్మ, సైన్స్ ఉపాధ్యాయుడు నరసింహారావు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న అతిథులు

పామూరు, సెప్టెంబరు 25 : విద్యార్థులు ఇష్టంతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సీఐ ఎం. భీమా నాయక్ సూచించారు. స్థానిక ఎస్వీ జూనియర్, ఈటీఎస్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వెల్‌కం వేడుకలను అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతు విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, లేకపోతే భవిషత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. అనంతరం గత ఏడాది పరీక్షల్లో రాష్ట్ర, నియోజకవర్గ, మండలస్థాయిలో ప్రథమ ర్యాంకులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఎంఈవో కరుణకుమారి, విద్యాసంస్థల కరస్పాండెంట్, వైసరేస్, ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖాదర్‌వలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీ

వీసీపల్లి, సెప్టెంబరు 25: ీఎసీపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ రమణారెడ్డిని బేస్తవారిపేటకు, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.నాగమణిని కనిగిరికి, టైపిస్ట్ పురుషోత్తంను హెచ్ఎం పాడుకు, జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్యను హెచ్ఎం పాడుకు బదిలీ చేస్తూ జడ్పీ నుంచి ఆదేశాలు అందాయి. ఆ మేరకు పోస్టు ద్వారా బదిలీ ఉత్తర్వుల కాపీలు బుధవారం ఉద్యోగులకు అందాయి.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

కల్లూరు(కురిచేడు),సెప్టెంబరు 25: కురిచేడు మండలం కల్లూరు గ్రామ రేషన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న 10 బస్తాల రేషన్ బియ్యాన్ని స్థానికులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. త్రిపురాంతకంకు చెందిన ఆటోలో వినుకొండలోని ఓ మిల్లుకు తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని కురిచేడు తహసీల్దార్ రజనీ కుమారికి అప్పగించారు. ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీఆర్వోతో పంచనామా నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.


ఏటీఎంల వద్ద భద్రత పటిష్టం చేసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 25 : బ్యాంక్‌లు, ఏటీఎంల వద్ద భద్రత పటిష్టం చేసుకోవాలని తాళ్లూరు ఎస్సై ఎస్.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు గ్రామాల్లోని కెనరా, యూనియన్, ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్లకు, ఏటీఎం నిర్వాహకులకు సెక్యూరిటీ ఏర్పాటుపై బుధవారం పోలీసులు నోటీసులు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.



సిద్ధమవుతోన్న.. రైతుల ప్లాట్లు

- నాటి వైసీపీ పాలనలో చిట్టడవిలా రైతుల ప్లాట్లు
- నేడు అద్దాల్లా చదునుగా దర్శనమిస్తున్న వైనం
- నాడు ఒక వెలుగు వెలిగిన ఆర్- 5 జోన్ ప్లాట్లు
- నేడు కంప చెట్లుతో నిండిపోయిన వైనం
- కోర్టు కేసు నడుస్తుండడంతో ఆ వైపు చూడని సీఆర్డీఏ




నాడు కంపచెట్లతో వున్న రైతుల ప్లాట్లు, పొలాలు



కంపచెట్లు తొలగడంతో కనువిందుగా రైతుల ప్లాట్లు, పొలాలు



కంపచెట్లతో నిండిపోయిన అంతర్గత రహదారి నాడు..



కంపచెట్లు తొలగించిన తరువాత రోడ్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓడలు బళ్లు.. బళ్లు ఓడలు కావడం అంటే ఇదేనేమో.. గత వైసీపీ పాలనలో చిట్టడవిలా మారి, చీకటితో నిండిపోయిన నవ్యాంధ్ర రాజధాని నేడు వెలుగులు చిమ్ముతోంది. నాడు రైతుల గుండెల్లో కుంపట్లు రాజేసిన ఆర్- 5 జోన్ నేడు కంప చెట్లతో అడవిలా మారిపోయింది. సరిగ్గా 15 నెలల్లో ఎంత మార్పు! 'ఇదే నా మాట.. నా మాటే శాసనం అన్నట్లుగా' సాగిన గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి పాలనలో 'తామే శాశ్వతం.. తామన్నదే వేదం.. తాము చెప్పిందే చట్టం' అన్నట్లుగా అమరావతిపై ఇష్టారీతిగా విరుచుకుపడ్డారు. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించి ఆర్- 5 జోన్ పేరుతో రాజధాని రైతుల గుండెలపై చిచ్చు రాజేశారు. సరిగ్గా ఏడాదిలోపే నియంతృత్వ పోకడలతో అమరావతి ధ్వంస రచన చేసిన వైసీపీ సర్కారు కుప్పకూలిపోయింది. టీడీపీ- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తెరపైకి వచ్చింది. అంతే పరిస్థితి మొత్తం తలకిందులైపోయింది.

కళకళలాడుతున్న ప్లాట్లు

రాజధాని కోసం భూములిచ్చిన 28,500 మంది రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను వైసీపీ ప్రభుత్వం తీవ్రనిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లపాటు వాటిని పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో కంపచెట్లతో రైతుల ప్లాట్లు అడవిలా మారిపోయాయి. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2022 మార్చి 30న చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పులో రైతుల ప్లాట్లలో వున్న చెట్లను తొలగించి వారికి ఆరు నెలల్లో స్థలాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ గత ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందే తప్ప ఒక్క చెట్టు కూడా తొలగించలేదు. అలాంటి రైతుల ప్లాట్లు కూటమి ప్రభుత్వం రాకతో కళకళలాడుతున్నాయి. 36.5 కోట్ల రూపాయలతో కూటమి ప్రభుత్వం 24వేల ఎకరాల్లో కంపచెట్లను తొలగించింది. కిందటి నెల 7న కంప చెట్ల తొలగింపుకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టగా నెల రోజుల్లో రాజధాని స్వరూపం మారిపోయింది. కాంట్రాక్టు దక్కించుకున్న ఎన్‌సీసీ సంస్థ పనులను శరవేగంగా సాగించింది. వర్షాలు పడినప్పటికీ పనులు వేగంగా సాగేలా చూసింది. దీంతో రైతుల ప్లాట్లు అందంగా కళకళలాడుతున్నాయి.



నాడు ఆర్- 5 జోన్ ప్లాట్లు

నేడు కంపచెట్లతో అడవిలా ఆర్- 5 జోన్

అడవిలా మారిన ఆర్- 5 జోన్

రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసి, రాజధాని నిర్మాణాన్ని శాస్వతంగా సమాధి చేయాలని భావిస్తూ జగన్ సర్కార్ 2023లో 'రాజధానిలో పేదలకు ఇళ్లు' అంటూ ఆర్- 5 జోన్ చిచ్చు రాజేసింది. రాజధానికి అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ సిటీ, ఫైనాన్షియల్ సిటీలను, పరిశ్రమలకు కేటాయించిన భూములను టార్గెట్ చేస్తూ ఆ భూముల్లో 53వేల మందికి సెంటు స్థలాలు ఇచ్చేందుకు ప్లాట్లు వేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల స్థలాల్లో చెట్ల తొలగింపుకు రూపాయి కూడా ఖర్చు చేయని వైసీపీ ప్రభుత్వం ఆర్- 5 జోన్లో ప్లాట్ల పేరుతో అక్షరాలా రూ. 130 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కంప చెట్లు తొలగించి, ప్లాట్లలో మెరక తోలించి, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, రోడ్లు వేయించి ఆర్- 5 జోన్‌ను సర్వాంగ సుందరంగా సిద్ధం చేసింది. రైతుల పోరాటం కారణంగా సుప్రీంకోర్టు ఆ వ్యవహారాన్ని అడ్డుకొంది. అంతే ఆర్- 5 జోన్‌కు కుట్ర ఆగిపోయింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆర్- 5 జోన్ అడవిలా మారిపోయింది. ఆర్- 5 జోన్ వ్యవహారం న్యాయస్థానాల పరిధిలో వుండడంతో కూటమి ప్రభుత్వం దాని జోలికి పోలేదు. దీంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్లాట్లు మొత్తం చిల్ల కంప అల్లుకుపోయింది.

రోడ్లకు మహర్దశ

కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే రాజధానిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. వైసీపీ పాలనలో మట్టిదిబ్బలతో, కంపచెట్లతో నిండిపోయిన సీడ్ యాక్సిస్ రోడ్డుకు మహర్దశ పట్టింది. అది తాజాగా ఎన్‌హెచ్-16తో అనుసంధానం కాబోతోంది. కంపచెట్ల తో నిండిపోయిన అంతర్గత రోడ్లు అం దంగా తయారై, వినియోగా నికి పూర్తిగా సిద్ధమయ్యాయి.



కంటి పాపలకు.. కష్టమొచ్చింది

- ప్రభుత్వ పాఠశాలల్లో 38,008మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- ఈ విద్యా సంవత్సరంలో 3.05 లక్షల మందికి కంటి పరీక్షలు
- 5,180 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీకి ప్రణాళిక

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: పేదరికం.. పౌష్టికాహార లోపం.. అవగాహన రాహిత్యం వెరసి పేదకుటుంబాల్లో విద్యార్థులకు కంటి సమస్యలు శాపాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి దిగ్భ్రాంతికర పరిస్థితులు భావిపౌరుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అంధత్వనివారణ సంస్థ నిర్వహించిన కంటిపరీక్షల్లో 38వేల మందికి పైగా విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అవగతం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాస్యం చేస్తున్నారు. ఇందులో అనేకమంది పౌష్టికాహారం లోపంవల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వ గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటిపరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. తొలి విడత ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరువరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థిని విద్యార్థులు ఏదో ఒక కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్ళజోళ్ళు అవసరమైన విద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలో కళ్ళజోళ్ళు పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యార్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొన్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా దాదాపు 600మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణ అందించారు.

కంటి సమస్యలకు ఇవీ ప్రధాన కారణాలు...

దృష్టిలోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహారలోపం, అంటువ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికరమైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారంపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహారం లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యులు చెబుతున్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ

- డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్



జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను ఆగస్టు నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు పాఠశాలల్లో ఉచితంగా కంటి పరీక్ష లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వనివారణ సంస్థ అధికారి డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఇప్పటికే 2.80లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 36,411 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిం చినట్లు తెలిపారు. వీరిలో 3,798 మందికి ఉచితంగా ఈ ఏడాది కళ్ళజోళ్ళు ప్రభుత్వం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు కంటి పరీక్షల స్క్రీనింగ్ పాఠశాలల్లో జరుగుతుందని పేర్కొన్నారు.

జీతం ఒక చోట.. కొలువు మరో చోట

- ఆర్డీవో కార్యాలయంలో సిబ్బంది కొరత
- వివిధ పనులపై వచ్చే వారికి తప్పని తిప్పలు



చీరాల ఆర్డీవో కార్యాలయం

చీరాల, సెప్టెంబరు 25: చీరాల ఆర్డీవో కార్యాలయాన్ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. కార్యాలయంలో ముగ్గురు తహసీల్దార్లను డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించారు. కానీ వారి జీతాలు మాత్రం ఈ కార్యాలయం నుంచే చెల్లిస్తున్నారు. దీంతో జీతం ఒక చోట, కొలువులు మరో చోట అవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని వివిధ పనులపై వచ్చే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో మొత్తం 10 మంది ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. చీరాల ఆర్డీవో కార్యాలయ పరిధిలో చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు, పది మండలాలు ఉన్నాయి. కార్యాలయంలో ఆర్డీవో ఒకరు, డీఏవో ఒకరు, డిప్యూటీ తహసీల్దార్లు ముగ్గురు, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు, టైపిస్ట్ ఒకరు ఉండాలి. అయితే ముగ్గురు డీటీలు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు లేరు. ముగ్గురు డీటీ(డిప్యూటీ తహసీల్దార్)లు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఒకరు బాపట్ల, మరొకరు పర్చూరు, వేరొకరు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పీఎస్(పర్సనల్ సెక్రటరీ)గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ ముగ్గురికి ప్రతి నెలా జీతాలు మాత్రం చీరాల ఆర్డీవో కార్యాలయం నుంచి డ్రా చేస్తున్నారు. దీంతో జీతం ఒక చోట.. కొలువు మరో చోట అయితే ఎలా అని వివిధ పనులపై వచ్చేవారు ఆక్షేపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ఆర్డీవో కార్యాలయంలో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బందిని నియమించి పనులు పారదర్శకంగా, జాప్యం లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీపీఈవోగా దేవదత్తు

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీపీఈవో (డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్)గా జి.దేవదత్తును నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ డీపీఈవోగా ఉన్న అరుణకుమారి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మద్యంపై నూతన పాలసీని త్వరలోనే ప్రభుత్వం తేనుండడంతో ఈ బదిలీలకు ప్రాధాన్యత నెలకొంది. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖలోని ఉద్యోగులను చీల్చి సెబ్‌ను ఏర్పాటు చేసి దాని పాలనను నీరుగార్చిన సంగతి తెలిసిందే. ఇన్ని రోజులూ అయిష్టంగానే సెబ్‌లో పనిచేసిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో సొంతగూటికి చేరుకున్నారు. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉండడంతో సెబ్‌లో పనిచేసిన ఉద్యోగులకు కూడా పోస్టింగ్‌లు దక్కనున్నాయి. జిల్లాలో మొన్నటి వరకు సెబ్‌లో పనిచేసిన ఉద్యోగులను రిలీవ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

వైసీపీ పగ్గాలు మాకొద్దు

- అధినేత జగన్‌ను కలిసిన చీరాల నేతలు
- జిల్లా అధ్యక్ష బాధ్యతలను చేపట్టలేనన్న కరణం
- గాదె మధుసూదనరెడ్డికి ఖరారయ్యే అవకాశం

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పగ్గాలను స్వీకరించాలని కరణం వెంకటేశ్ ను ఇటీవల జరిగిన సమావేశంలో అధినేత జగన్ కోరగా నిర్ణయం తెలపడానికి సమయం కోరిన సంగతి తెలిసిందే. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంతో పాటు ఆయన చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు వెంకటేశ్ బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ని కలిసినట్లు సమాచారం. తనకు వైసీపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు వద్దని వెంకటేశ్ తిరస్కరించడమే కాకుండా తమను చీరాలకే పరిమితం చేయాలని మాజీ ఎమ్మెల్యే బలరాం కృష్ణమూర్తి కోరినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు మధుసూదనరెడ్డికి జిల్లా పగ్గాలు అందించనున్నారని తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ పార్టీతో పాటు ఎంపీ పదవికి కూడా ఇటీవల రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్ష పదవిని భర్తీ చేయడానికి తాడేపల్లి పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. చీరాల నుంచి పోటీ చేసి ఓటమి పాలైన కరణం వెంకటేశ్ వైపు ఇటీవల జరిగిన జిల్లా నేతల సమావేశంలో జగన్ మొగ్గు చూపగా, ఆ ప్రతిపాదనను బుధవారం నాటి భేటీలో వారు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో మధుసూదనరెడ్డి పేరు తెరమీదకు వచ్చింది. ఈయన మొన్నటి ఎన్నికల్లో బాపట్ల వైసీపీ సీటు కోసం సర్వశక్తులు ఒడ్డారు. కానీ ఆయనను కాదని సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతికే వైసీపీ అధిష్ఠానం సీటు కేటాయించగా ఎన్నికల్లో ఆయన చిత్తుగా ఓడిపోయిన సంగతి విదితమే. వైసీపీలో ఉన్న నేతలెవరూ జిల్లా పగ్గాలు అందుకోవడానికి సుముఖత చూపకపోవడంతో మొన్నటి ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడ్డ మధుసూదనరెడ్డికి పగ్గాలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలుస్తోంది.

ముగిసిన రాష్ట్ర ఖోఖో బాలుర జట్టు శిక్షణ



క్రీడా దుస్తులు అందిస్తున్న ప్రిన్సిపాల్ ఉషారాణి, నేతలు

పంగులూరు, సెప్టెంబరు 25: జాతీయ స్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టు శిక్షణ బుధవారం ముగిసింది. పంగులూరు ఎంఎస్.ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ అకాడమీ పర్యవేక్షణలో బాలుర జట్టుకు అంతర్జాతీయ క్రీడాకారుడు పి.శివారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ పి.పాల్ పది రోజులుగా శిక్షణ ఇచ్చారు. జట్టు 28 నుంచి అక్టోబరు 3 వరకు జార్ఖండ్‌లోని షిండిగా పట్టణంలో జరిగే జాతీయస్థాయి అండర్ 14 ఖోఖో బాలుర పోటీల్లో పాల్గొంటుంది. కృష్ణా జిల్లా ఎలమూరు ఉన్నత పాఠశాలలో బాలికల రాష్ట్ర జట్టుకు శిక్షణ ఇచ్చినట్లు ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ జట్లకు మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం వారి తనయులు సీతారామిరెడ్డి, న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి, మనవలు ప్రియదర్శినిరెడ్డి 50 వేల విలువ చేసే క్రీడా దుస్తులను సమకూర్చగా కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారాణి, టీడీపీ నేత రావూరి రమేష్ క్రీడా దుస్తులను అందచేశారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, ఆర్వీ సుబ్బారావు, కోచ్‌లు శివారెడ్డి, పౌల్, జిల్లా అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, కాశీవిశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర బాలుర జట్టు: జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే బాలుర జట్టును రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి బుధవారం ప్రకటించారు. జట్టులో డి.బాజీవలి, వి.సాగర్, కె.వెంకటసాయి, ఎ.శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు(ప్రకాశం), పి.జ్యోతిరాము(అనంతపురం), ఎన్.భవానీశంకర్(కృష్ణా), ఎస్.వీరేంద్ర(తూ.గో.), బి.రామన్‌పాల్(గుంటూరు), ఆర్.బాలాజీ (కర్నూల్), శృతిక్‌సాయి(విశాఖ), బద్రీనాథ్(చిత్తూరు), ఎం.గౌతమ్(నెల్లూరు) ఉన్నారు. జట్టుకు కోచ్‌లుగా పి.శివారెడ్డి, పి.పౌల్, మేనేజర్‌గా షేక్ అహమ్మద్ వ్యవహరిస్తారని తెలిపారు.

వరద సాయం విడుదల

- 33,586 మంది రైతులకు సాయం
- పంట నష్ట పరిహారం పెంచి ఖాతాల్లో జమ

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదలకి తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సాయంత్రం నుంచే రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అవుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో హెక్టారుకు రూ.17,000 ఉండే సాయాన్ని రూ.25,000కు పెంచి ప్రభుత్వం విడుదల చేస్తోంది. బాధితుల జాబితా ఆధారంగా దాదాపు 480 మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో సాంకేతికపరమైన సమస్యలను పరిష్కరించి బాధితులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో సొమ్ము జమ అయ్యేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 33,586 మంది రైతులు పంట నష్ట పరిహారం అందుకోనున్నారు. ఇందులో వ్యవసాయ పైర్లకు సంబంధించి 44,652 ఎకరాలకు రూ.44.62 కోట్లు, ఉద్యాన పంటలు 8,678 ఎకరాలకు రూ.13.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విపత్తు వచ్చిన రెండు వారాల వ్యవధిలోనే ఇన్‌పుట్ సబ్సిడీని ఖాతాల్లో జమ చేయడంతో పాటు అందించే పరిహారాన్ని గతంతో పోలిస్తే పెంచి ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ముంపునకు గురైన ప్రతి ఇంటికీ రూ.10,000

లంక గ్రామాల్లో 7,970 ఇళ్లు నీట మునిగినట్లు యంత్రాంగం లెక్క తేల్చింది. వీటికి సంబంధించి ప్రతి ఒక్క ఇంటికీ నష్ట పరిహారంగా రూ.10,000 విడుదల చేయనుంది. పశువుల పాకలు 438 వరకు నీటిలో మునిగినట్లు గుర్తించారు. వీటికి ఒక్కో పాకకు రూ.5,000 పరిహారంగా ఇవ్వనున్నారు. నీళ్లలో మునిగి 809 ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయని లెక్క తేల్చిన యంత్రాంగం వీటికి ఒక్కో బైక్‌కి రూ.3,000 సాయం ప్రభుత్వం అందించనుంది. ఆటోలు 38 వరకు దెబ్బతిన్నాయని ఒక్కోదానికి రూ.10,000, పది పశువులు మరణించగా ఒక్కో దానికి రూ.25,000 చొప్పున నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. మత్స్యకారులకు సంబంధించిన 33 వలలు దెబ్బతిన్నాయని, 369 హెక్టార్లలో రొయ్యలసాగు దెబ్బతినడం వల్ల 369 మంది రైతులకు నష్టం వాటిల్లిందని ఇందుకు సంబంధించి రూ.65 లక్షల పరహారం బాధితుల ఖాతాల్లో జమ చేయనుంది.

ఖోఖో రాష్ట్ర జట్టులో పంగులూరు విద్యార్థులు


శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, వి.సాగర్

పంగులూరు, సెప్టెంబరు 25 : జార్ఖండ్‌లో ఈనెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు పంగులూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎ.శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, 8వ తరగతి విద్యార్థి వి.సాగర్ జట్టులో స్థానం పొందారు. విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నాచెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, సెప్టెంబరు 25 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో అన్నాతమ్ముళ్ల పిల్లలు వరుసకు అన్న చెల్లెళ్లు అయిన యువతీయువకుడు బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. కొమ్మినేనివారిపాలెం గ్రామంలో అన్న తమ్ముళ్ల గృహాలు పక్కపక్కనే ఉన్నాయి. బుధవారం ఉదయం ముందుగా వారిలో ఒకరి కుమార్తె పురుగు మందు తాగగా, గంట తరువాత యువతికి అన్న వరుస అయిన యువకుడు కూడా పురుగు మందు తాగాడు. వెంటనే వారిని తల్లిదండ్రులు వైద్యం కోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

ఏడు ఎడ్ల బండ్లు స్వాధీనం


పట్టుబడిన బండ్ల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

చీరాలనగర్(చీరాలటౌన్), సెప్టెంబర్ 25 : ఇసుక అక్రమ తవ్వకాలపై చీరాల రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. కొద్ది రోజులుగా ఏదో ఒక చోట దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. బుధవారం తహసీల్దార్ గోపీకృష్ణ ఆదేశాల మేరకు చీరాల నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించారు. ఏడు ఎడ్ల బండ్లను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో పలువురు వీఆర్వోలు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం, గుంటూరుకు తరలింపు

చీరాలటౌన్, సెప్టెంబరు 25 : ఇటీవల ఓ కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన విషయాన్ని మరువక ముందే మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం ముత్తాయిపాలెంకు చెందిన సుమారు ఎనిమిది మంది చీరాల పరిధిలో విద్యుత్ పనులకు కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్నారు. బుధవారం పనులు అయ్యాక విద్యుత్ సరఫరా చేశారు. కొన్నిచోట్ల సరఫరా రాకపోవడంతో పరిశీలించేందుకు తాతా వెంకటస్వామి స్తంభం ఎక్కాడు. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించి, పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు.

కుమారుడిపై తండ్రి దాడి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 25 : కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రి కుమారుడిపై దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండలం బుర్లవారిపాలెంకు చెందిన కరుణసాగర్‌కు తండ్రి ఏసోబుతో స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో మంగళవారం తండ్రితో పాటు మరో వ్యక్తి పీటర్‌పాల్ కూడా సాగర్‌పై దాడి చేశారు. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా, ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

30 నుంచి ప్రాయశ్చిత దీక్షా కార్యక్రమాలు

అద్దంకి, సెప్టెంబరు 25 : తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేసిన ఘటన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు జనసేన ఆధ్వర్యంలో దేవాలయాలలో కార్యక్రమాలు నిర్వహించేందుకు నేతలు పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాయలంలో నియోజకవర్గ నేతలు సమావేశం అయ్యారు. 30వ తేదీ సాయంత్రం గ్రామాలలోని దేవాలయాలలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించాలన్నారు. 1న నమో నారాయణాయణ మంత్రాన్ని ప్రతి ఒక్కరూ పఠించాలని, 2న నగరసంకీర్తన, 3న ఆలయాలలో భజన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు చల్లా కృష్ణ, చెవుల వెంకట్రావు, కొట్టే నరసింహారావు, రామాంజనేయులు, పూర్ణ చంద్రరావు, తోట కృష్ణ, చిరంజీవి, జానకిరామయ్య, రాజశేఖర్, సాంబశివ రావు పాల్గొన్నారు.

పశ్చిమాన భారీ, తూర్పున మోస్తరు

జిల్లావ్యాప్తంగా వర్షం

సగటున 33.0 మి.మీ నమోదు

పలుచోట్ల పొంగిన వాగులు, వంకలు

అక్కడక్కడా రాకపోకలకు ఆటంకం

ఖరీఫ్ పైర్లకు జీవం, రబీ సాగుకు అనుకూలం

ఒంగోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం వేకువజామున వర్షం కురిసింది. పశ్చిమ ప్రాంతంలో భారీవర్షమే కురవగా తూర్పు ప్రాంతంలో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. బుధవారం ఉదయం 9 గంటలకు గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 33.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదిలి మండలంలో 104.6 మి.మీ నమోదు కాగా మార్కాపురంలో 77.6 మి.మీ కురిసింది. అలాగే కంభం, కేకేమిట్ల, బీపేట, దర్శి, తర్లుపాడు, మర్రిపూడి, దొనకొండ, సీఎస్ పురం, కురిచేడు మండలాల్లో 50 నుంచి 75 మి.మీ కొమరోలు, సింగరాయకొండ, ముండ్లమూరు తాళ్లూరు, పీసీపల్లి, పామూరు, పెద్దారవీడు మండలాల్లో 25.0నుంచి 50.0 మి.మీ మధ్య నమోదైంది. ఇతర చోట్ల ఒక మోస్తరుగా జల్లులు పడ్డాయి. కాగా పశ్చిమ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు కూడా కొంతసేపు అటంకం ఏర్పడింది.

వాగులో చిక్కుకున్న బస్సు

పొదిలి మండలం బట్టువారిపల్లి వద్ద వాగు పొంగి అందులో ఆర్టీసీ బస్సు చిక్కుకకపోగా అధికారులు సురక్షితంగా బయటకు చేర్చారు. బస్సులో ప్రయాణికులు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మార్కాపురం-పొదిలి మార్గంలో రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. తర్లుపాడు, మార్కాపురం, కంభం, అర్ధవీడు, బీపేట తదితర మండలాల్లోనూ అక్కడక్కడ వాగులు పొంది రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ప్రస్తుత వర్షం సాగుకు బాగా ఉపయుక్తం కానుంది. ఖరీఫ్‌లో దాదాపు 2.75 లక్షల ఎకరాల్లో పంటలు వేగా 90 శాతం పొలంలోనే ఉన్నాయి. ప్రధానంగా కంది, పత్తి, సజ్జ వంటివి ఉండగా వాటన్నింటికి ఈ వర్షం జీవం పోసింది. పలుచోట్ల పొగాకు, మిర్చి, వరి నాట్లు వేస్తుండగా అవి అధికంగా సాగుతున్నాయి. ఇక వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్ పంటల సాగుకు ఈ వర్షాలు బాగా మేలు చేయనున్నాయి. ప్రధానంగా పొగాకు, మిర్చి, వరి సాగు అక్టోబరులో పశ్చిమప్రాంతంలో అధికంగా వేస్తారు. అలాంటి ప్రాంతాలకు ఈ వర్షాలు బాగా ఉపకరించనున్నాయి. అలాగే తూర్పు ప్రాంతంలోనూ రబీ సాగుకు భూములు సిద్ధం చేసుకునే విధంగా వర్షాలు ఉపకరించనున్నాయి.

ఎక్సైజ్ డీసీగా హేమంత్ నాగరాజు

పలువురు అధికారుల బదిలీ

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు25: ఎక్సైజ్ శాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను విలీనం చేసారు. ప్రస్తుతం పాత పద్ధతిలోనే జిల్లాను యూనిట్‌గా తీసుకొని డిప్యూటీ కమిషనర్‌గా నెల్లూరులో ఎస్ఈబీలో ఉన్న కె.హేమంత్ నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎస్.కె.ఖాజామొహిద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు ఖాజామొహిద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులను కలిసేందుకు విజయవాడ వెళ్లారు.

మళ్లీ ఫ్లెక్సీల రగడ


చించివేసిన బాలినేని ఫ్లెక్సీ

టీడీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన

ఒంగోలులో బాలినేని బొమ్మలు చించివేత

ప్రధాన కూడళ్లల్లోని ఫొటోల తొలగింపు

ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన మాజీమంత్రి

లాయర్‌పేటలో జనసేన నాయకుల నిరసన

నేడు జనసేన పార్టీలోకి బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమైన వేళ ఒంగోలు ఫ్లెక్సీల రగడ మరోమారు రాజుకుంది. తొలుత బాలినేని పార్టీ మార్పుపై ఎమ్మెల్యే జనార్దన్ ధ్వజమెత్తడం, అంతకుముందు మాజీ మంత్రి అనుచరులు వేసిన ఫ్లెక్సీని టీడీపీ శ్రేణులు తీసివేసే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఆ రెండు విషయాలపై బాలినేని కూడా స్పందించారు. ఈ నేపథ్యంలో గురువారం బాలినేని జనసేనలో చేరే తేదీపై స్పష్టత వచ్చింది. అయితే బుధవారం రాత్రి బాలినేని అనుయాయులు వేసిన ఫ్లెక్సీలను మరోమారు గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. అదేసమయంలో బాలినేనిని జనసేనలో చేర్చుకోవద్దంటూ తెలుగు యువత శ్రేణులు నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించాయి. తిరిగి బుధవారం రాత్రి ఎన్నికల ముందు టీడీపీలో చేరిన సూర్యప్రకాష్‌రెడ్డి బాలినేని మంత్రిగా అవినీతికి పాల్పడినందున పార్టీలోకి చేర్చుకోవద్దంటూ జనసేన అధినేత పవన్‌కు బహిరంగంగా సూచించారు. స్థానికంగా జరిగే అంశాలను పట్టించుకోకుండా గురువారం సాయంత్రమే పవన్ వద్ద మాజీమంత్రిని పార్టీలో చేరాలని సమాచారం వచ్చింది. నగరంలో వ్యాపారవేత్త కంది రవిశంకర్, అతని సమీప బంధువు గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే రోశయ్యలు గురువారం జనసేనలో చేరనున్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

మాజీమంత్రి బాలినేని గురువారం జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తూ ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని చించివేశారు. లాయర్‌పేటలో ప్రకాశం పంతులు బొమ్మ, వీఐపీ రోడ్డు, జయరాం థియేటర్ సెంటర్, సీవీఎన్ రీడింగ్‌రూం తదితర ప్రాంతాల్లో పెద్ద పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిని మంగళవారం రాత్రి పెట్టగా, తెల్లవారేసరికి ఎవరో చించి పడేశారు. ఆ ఫ్లెక్సీల్లో కేవలం బాలినేని ఫొటో ఉన్నంత వరకే చించివేసి మిగిలినవి అదేవిధంగా ఉండేలా చేశారు. దీంతో బుధవారం ఉదయం నుంచి ఈ విషయంపై విస్తృతంగా చర్చ నడిచింది. లాయర్‌పేటలో జనసేన పార్టీలోని కొంతమంది ఫ్లెక్సీ వద్ద నిరసన తెలిపారు. మరోవైపు ఒంగోలు నగరంలో ఫ్లెక్సీల చించివేతపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం మధ్యాహ్నం ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలినేని వెంట గొర్రెపాటి శ్రీనివాసరావు, జడా బాలనాగేంద్రయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

కూటమి పాలన ప్రజారంజకం

పింఛన్ రూ.4వేలకు పెంచి ఒకటో తేదీనే ఇస్తున్నాం

సంక్రాంతి నుంచి కొత్త ఇళ్ల నిర్మాణాలు

యూనిట్ వ్యయం రూ.4లక్షలకు పెంపు

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు : మంత్రి స్వామి


మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, అధికారులు


కొండపి, సెప్టెంబరు 25 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలన ప్రజా రంజకంగా సాగుతున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇది మంచి ప్రభుత్వమని చెప్పడానికి వంద రోజుల పాలనే రుజువని పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్ పి.మురళి అధ్యక్షతన జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఒక్కరోజులోనే ఇంటివద్దనే అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు 14వ తేదీ ఇస్తే, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లు తెరిచి పేదల ఆకలి తీరుస్తున్నామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటన ద్వారా 16,300 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు మేలు చేశామన్నారు. సంక్రాంతి నుంచి ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో లబ్ధిదారులకు యూనిట్ వ్యయం రూ.4 లక్షలు పెంచుతున్నట్లు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో గృహాల నిర్మించుకొని బిల్లులు ఆగిపోయిన వారికి వాటిని చెల్లిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి అనర్హులైన పింఛన్ లబ్ధిదారులను తొలగించి అర్హులకు కొత్తవి మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పథకాలు విజయం : కలెక్టర్

ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి వారం 'మీకోసం' నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అంతకుముందు హైస్కూల్ ఎదురు బజారులోని పలు ఇళ్లకు మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా వెళ్లి గోడలకు 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌లను అంటించారు. యజమానులకు కరపత్రాలు అందజేశారు. సభలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, డీపీవో ఉషారాణి, డీఎవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ జె.రవిబాబు, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చైర్మన్లు

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి : చంద్రబాబు సూచన


సీఎంకు బొకే ఇస్తున్న దినకర్, పక్కన సత్య, బాలాజీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కొత్తగా కార్పొరేషన్ చైర్మన్లు అయిన దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, లంకా దినకర్‌లు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశారు. వీరిలో సత్య, బాలాజీలు టీడీపీ తరఫున, దినకర్ బీజేపీ తరఫున చైర్మన్లుగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన కొత్తగా నియమితులైన 20మంది చైర్మన్లతో భేటీ అయ్యారు. ఆ తర్వాత జిల్లాకు చెందిన ముగ్గురు చైర్మన్లు విడివిడిగా చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆ సందర్భంగా బాబు మాట్లాడుతూ నిజాయితీగా, సమర్థవతంగా బాధ్యతలు నిర్వహించి ఇటు కూటమి ప్రభుత్వానికి అటు మీరు ప్రాతినిథ్యం వహించే పార్టీల్లో, ప్రజల్లో మంచిపేరు తేవాలని సూచించారు. మారిటైం బోర్డు చైర్మెన్‌గా ఎంపికైన సత్యను బాబు బుజం తట్టి ఇంతకాలం పార్టీ పనిలో సక్సెస్ అయ్యారు. చైర్మన్‌గా కూడా విజయవంతమై మాట నిలుపుకోవాలని సూచించారు.

టుబాకో అసోసియేషన్ విరాళం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇండియన్ టుబాకో అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి రూ.50లక్షలు వరద బాధితులకు విరాళంగా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని వారు చెక్ రూపంలో ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్‌సుందర్, కోశాధికారి గుత్తా వాసుబాబు, ఇతర నాయకులు వైపె చౌదరి, రమేష్‌బాబు, ఐటీసీ నుంచి వెంకటరామిరెడ్డి, వీఎస్‌టీ కంపెనీ నుంచి డాక్టర్ లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

ఇంకొల్లు, సెప్టెంబరు 25 : ఇంకొల్లు మండలం నాగండ్లలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై బుధవారం ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6 మోటర్‌సైకిళ్లు, రూ.6290, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జడ్పీలో బదిలీల ప్రతిష్టంభన

దర్శి ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ నేత

డిప్యూటీ సీఈవో వద్ద సాగర్ ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల బదిలీల వ్యవహారం చినికిచినికి గాలివానగా మారింది. ప్రధానంగా దర్శి నియోజకవర్గంలోని ఎంపీడీవో నియామకాల విషయంలో వైసీపీకి చెందిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌ల పరిధిలోకి పోవడంతో వివాదం ముదిరింది. బుధవారం జడ్పీ కార్యాలయానికి వెళ్లిన డాక్టర్ సాగర్ డిప్యూటీ సీఈవోతో వాదనకు దిగడం అదేసమయంలో ఒకరిద్దరు ఆయన అనుచరులు ముఖ్యంగా ఒక మీడియా వ్యక్తి దూకుడుగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి చెందిన బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ చైర్మన్‌గా ఉండగా ఆమె కుమారుడు శివప్రసాద్‌రెడ్డి దర్శి ఎమ్మెల్యేగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో తాము కోరిన వారినే ఎంపీడీవోలుగా వేయాలని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పట్టుపడుతుండగా జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ వైపు నుంచి కొన్ని మండలాల అధికారులను తాము కోరినట్లు వేయాలన్న ఒత్తిడి అధికారులపై వచ్చింది. జడ్పీకి ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా మాధురి ఉండగా, డిప్యూటీ సీఈవోగా హనుమంతరావు ఉన్నారు. అనుకూలమైన కొత్త సీఈవోను నియమించుకుని ముందుకు పోవాలని అధికారపార్టీ నేతలు భావించారు. కొత్త సీఈవో నియామకంలో జాప్యం జరిగి రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి చిరంజీవి అనే అధికారిని నియమించారు. ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. బదిలీల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిపోతుండటంతో ఎంపీడీవోల బదిలీకి శ్రీకారం పలికారు. ఎక్కువ నియోజకవర్గాలకు సంబంధించి అధికార టీడీపీ ఎమ్మెల్యేలు సూచించిన ఎంపీడీవోల నియామకాలు జరిగాయి. దర్శి నియోజకవర్గంలో ఐదు మండలాల ఎంపీడీవోల విషయంలో పోటీ నెలకొంది. ఇటు జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అయిన శివప్రసాద్‌రెడ్డిలు తాము సూచించిన వారినే ఆయా మండలాలకు నియమించాలని అధికారులపై ఒత్తిడి పెంచారు. మరోవైపు టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌లు తాము సూచించిన వారిని ఎంపీడీవోలుగా నియమించాలని ఒత్తిడి చేశారు. ప్రభుత్వంలోని కొందరు ప్రముఖులు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి చెప్పిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కూడా మౌఖికంగా సూచించారు. దీంతో అధికారులు ఒత్తిడికి గురై దర్శి నియోజకవర్గ ఎంపీడీవోల నియామకాన్ని బుధవారానికి పూర్తి చేయలేదు.

జడ్పీ కార్యాలయంలో గందరగోళం

ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం జడ్పీ కార్యాలయానికి లక్ష్మి భర్త సాగర్ వెళ్లారు. ఆయన డిప్యూటీ సీఈవో వద్ద ఉద్యోగులను బదిలీ చేసే అధికారం మీదే కాబట్టి తాము సూచించిన వారినే ఎంపీడీవోలుగా పంపాలని పట్టుబట్టారు. కొద్దిసేపటికి ఆ గదిలోకి జడ్పీ చైర్మన్ సీసీ వచ్చి బదిలీలు చేసే అధికారం చైర్మన్‌కు ఉంటుందని, చైర్మన్ సూచించిన వారినే దర్శి మండలాలకు పంపాలని కాదంటే ఇబ్బందిపడతారని హెచ్చరించారు. దీంతో సాగర్ పక్కన ఉన్న దర్శి నియోకవర్గానికి చెందిన వారు చైర్మన్ సీసీ తోటి, అధికారులతోటి వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో సాగర్‌తోపాటు జడ్పీకి వెళ్లిన జర్నలిస్ట్ దూకుడుగా వ్యవహరిస్తూ, ఉద్యోగులు, సీసీలను నిలదీసి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో కార్యాలయంలో వివాదం పెద్దదైంది. డిప్యూటీ సీఈవో అటు చైర్మన్ సీసీకిగాని, ఇటు సాగర్‌కు ఎలాంటి హామీ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. ఆ తర్వాత టీడీపీ నాయకుడు సాగర్ కలెక్టర్ అన్సారియాను కలిసి బదిలీల అధికారం సీఈవోకే ఉంటుందని, వారే చేయాలని చైర్మన్ ఒత్తిడికి అనుకూలంగా బదిలీ చేస్తే మేము ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని చెప్పినట్లు తెలిసింది.

అప్పు తీర్చలేక.. వృద్ధురాలి హత్య?

చీరాల్లో మరో ఘటన

కూల్‌డ్రింక్‌లో సైనేడ్ కలిపి హతమార్చిన వైనం

మృతదేహాన్ని కారులో దొనకొండకు తరలింపు

ఆనవాళ్లు లేకుండా చేసేందుకు దహనం

పోలీసుల అదుపులో నిందితులు


గుర్రపడి విజయలక్ష్మి(ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబర్ 25 : చీరాల్లో మరో వృద్ధురాలు హత్యకు గురైన ఘటన అందరినీ కలవరానికి గురిచేంది. గత జూలై 23న చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలేనికి చెందిన విశ్రాంత టీచర్ పిల్లి లలితమ్మ(75)ను హత్య చేసిన విషయాన్ని మరువకముందే మరో వృద్ధురాలి హత్య ఉదంతం కలకలం రేపింది. చీరాల మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేటకు చెందిన విజయలక్ష్మి(75) హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... ఉజిలీపేటకు చెందిన గుర్రపడి విజయలక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారు. హైదరాబాద్‌లో కుమారుడు(సాఫ్ట్‌వేర్), అమెరికాలో కుమార్తె (సాఫ్ట్‌వేర్) ఉంటున్నారు. ఆమె ఇంటి ముందు ఉన్న షాపును కనిగిరికి చెందిన రవి మరో వ్యక్తి చాలకాలంగా అద్దెకు తీసుకుని టైల్స్ షాపు నడుపుతున్నారు. సుమారు రెండేళ్ల కిందట అగ్రిమెంట్ పూర్తికాగా భాగస్వామ్యం తొలగించి రవి ఒంటరిగా షాపును నడుపుతున్నారు. వృద్ధురాలు ఆర్థికంగా బలంగా ఉండడంతో రవి అప్పటికే ఆమె వద్ద సుమారు రూ.4 లక్షలు వరకు అప్పుగా తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రవి వృద్ధురాలి బాకీ తీర్చలేననే వేదన పడుతున్నారు. దీంతో అన్నను ఎలాగైనా అప్పు నుంచి బయటపడేయాలని తమ్ముడు తేజ రంగంలోకి దిగాడు. వృద్ధురాలిని వైదొలగిస్తే ఇబ్బందులు తీరతాయనుకున్నాడు. దీంతో కారంచేడుకు చెందిన రాము సాయంతో ఈనెల 15వ తేదీన ఇంటిలో ఉన్న ఆమెను డబ్బులు ఇస్తాం రమ్మని షాపు వద్దకు పిలిపించాడు. పథకం ప్రకారం థమ్సప్‌లో సైనేడ్ కలిపాడు. మాయమాటలు చెప్పి తాగించారు. కొద్దిసేపటికే విజయలక్ష్మి కుప్పకూలింది. వెంటనే కారులో కారంచేడు మీదుగా దొనకొండకు తరలించి మృతదేహాన్ని దహనం చేశారు.

వెలుగులోకి ఇలా...

విజయలక్ష్మి కనిపించకపోవడంతో ఆమె బంధువులు కనిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడికి ఫోన్ ద్వారా చెప్పారు. ఆ తర్వాత బంధువులు అందరూ కలిసి అన్నిచోట్లా వెదికినా ఆచూకీ తెలియలేదు. చివరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె అదృశ్యమైన నాటికి ఆమె ఒంటిపై పది సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్నారు. దొనకొండ ఘటనా స్థలంలో అనుమానం వచ్చిన స్థానిక పోలీసులు చీరాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం సీఐ శ్రీనివాసరావు దొనకొండకు వెళ్లి పరిశీలించారు. మంగళవారం రాత్రికే నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనపై నేడో రేపో అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

సబ్‌రిజిస్ట్రార్ హేమలత సస్పెన్షన్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: వైపాలెంలో భూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అవకతవకలకు పాల్పడిన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హేమలతను సస్పెండ్ చేస్తూ డీఐజీ పుష్పలత బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డులో లేని సర్వే నంబరుతో ఆమె రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో విచారణ చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీచేశారు. జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేల్చారు. దీంతో ఆమెపై డీఐజీ సస్పెన్షన్ వేటు వేశారు అంతేకాకుండా విచారణ అనంతరం క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని అధికారులు తెలిపారు. హేమలత ఇంకొల్లులో పనిచేస్తుండగా డిప్యుటేషన్‌పై ఎర్రగొండపాలెం జాయిట్ సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇటీవల బదిలీలో ఆమెను సింగరాయకొండ వేశారు. వైపాలెంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇంకొల్లులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : రైతులు సాగులో మెలకువలు పాటిస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కే ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న పసుపు పంటను పరిశీలించి, ఇనుప ధాతులోపాన్ని వ్యవసాయ అధికారులు గుర్తించారు. దాని నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అశోక్, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సంచాలకులు మస్తాన్‌రావు, తుమాటి సాయిబాబు, గ్రామ రైతులు చింతా వెంకటేశ్వరరెడ్డి, కఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పత్తి పంటలో తెల్లదోమ ఉధృతి తగ్గించుకోవడానికి లింగార్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. నక్కపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తిని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ గ్రామ సహాయకులు నాగేశ్వరరావు, అన్నపూర్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : రైతులు ఒక వైపు సేంద్రియ విధానం, మరో వైపు మేలైన యాజమాన్య పద్ధతులను వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పలువురు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెం, అక్కాయిపాలెం రైతు సేవా కేంద్రాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉష, ట్రైనింగ్ సెంటర్ ఏడీఏ రత్నకుమారి, ఏవో కాశీవిశ్వనాథ్ రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : రైతులు పంటల సాగులో మెళకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. ఉప్పుమాగులూరు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

పంగులూరు : పంటసాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు రైతులకు సూచించారు.మండలంలోని ముప్పవరం, బైటమంజులూరు గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాగులో ఉన్న మినుము, సుబాబులుతో పాటు వరి నారు మడులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి, కుక్కపల్లి ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, రావూరి రమేష్, జగన్మోహన్, తిరుమలరాజు, అప్పలరాజు, వెంకయ్య, వీఏఏలు పృథ్వీ, దిల్షా, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాలలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, తాళ్లూరి లావణ్యా కోటేశ్వరరావు, పెంట్యాల శరత్, రాజుగారిపాలెంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, చింతలపూడి శ్రీను, అచ్చిరాజు పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మ మృతికి సంతాపం

పంగులూరు, సెప్టెంబరు 25 : స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు పార్వతమ్మ మృతి పట్ల పలువురు నేతలు, ఎంఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు సంతాపం తెలిపారు. పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో పార్వతమ్మ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి పూలమాల వేసి నివాళి అర్పించారు. మూడున్నర దశాబ్దాల క్రితం పంగులూరులో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యనందించడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీడీ సీతారామిరెడ్డి, రావూరి రమేష్, ఆర్వీ సుబ్బారావు, వీరరాఘవయ్య, ఐ.సుబ్బారావు, రవీంద్రనాథరెడ్డి, జేకేసీ, చౌదరిబాబు, నేతలు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, సెప్టెంబరు 25 : బీజేపీ సిద్ధాంత కర్తల్లో ఒకరైన పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనదయాళ్ పార్టీకి అందించిన సేవలను మననం చేశారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణారావు, మేడికొండ భరణిరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఎండిట్ దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ మండల నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెనిగండ్ల వెంకటేశ్వర్లు మార్గదర్శకుడు దీన్ దయాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి హరిబాబు, పెనుమాల రామయ్య, దావులూరి సుబ్బారావు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టు డే



మాట్లాడుతున్న కళాశాల అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టరు సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 25 : సెయింట్ ఆన్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసిస్టు డేని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఫార్మసీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ వీవీ నాగేశ్వరరావు, అక్రిడిడే షన్స్ డైరెక్టర్ డాక్టరు సుబ్బారావు మాట్లాడుతూ ఫార్మసిస్టు రంగంలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన విధి, విధానాలను వివరించారు. కార్యక్రమానికి చైతన్య ప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 25 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత అధికారులపై ఉందని చీరాల ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. అధికారులు, నేతలతో కలసి వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రెండు దశాబ్దాల కిందట రక్షిత మంచినీటి ట్యాంక్‌ను నిర్మించారని, దానిని నేటివరకు వినియోగంలోకి తేలేదని టీడీపీ నాయకుడు ఏడుకొండలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఇళ్ల పైనుంచి విద్యుత్ లైన్లు వెళ్లడంతో ఇబ్బందిగా ఉందని, డ్రైనేజీ సమస్యతో పాటు నివేసన స్థలాలు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారని కొండలు తెలిపారు. వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణం పేరుతో ఓ కాంట్రాక్టర్ లబ్ధిదారులవద్ద డబ్బు తీసుకుని నిర్మాణాలు చేపట్టకుండా పరారయ్యారని తెలపగా ఆర్డీవో స్పందిస్తూ హౌసింగ్ ఏఈని వివరణ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజారావు, ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఏఈలు రామ్‌కుమార్, కిషోర్‌కుమార్, ఆంజనేయులు, ఏపీఎం జ్యోతి ప్రసాద్, సంతోషం, ఏవో సుబ్బారెడ్డి, కార్యదర్శి జానీబేగం, నాయకులు బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్మోహనరావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, జాగర్లమూడి శ్రీనివాసరావు, శివరాజు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చినగంజాం : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు రేవు నాంచార్లు, పార్టీ సీనియర్ నాయకులు రాజు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా నోడల్ అధికారి డి.దాసు అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతం శ్రమించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వెంకటేశ్వరరెడ్డి అన్నా రు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేవారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులు పది లక్షల రూపాయిలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాబూరావు, గ్రామ ఉపసర్పంచ్ విక్రం, ఎంపీటీసీ సభ్యుడు మరపాల రాంబాబురెడ్డి, టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాంఆజాద్, రామసుబ్బారావు, రాజు ఉదయ్ బాస్కర్‌రెడ్డి, కొక్కిలిగడ్డ విష్ణు, మౌలాలి, వెంకటరమణ, పీకే బ్రహ్మం, తెట్టు శ్రీనివాసరెడ్డి, కొనసం జాలరామిరెడ్డి, పిచ్చయ్య, ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

చకచకా చెత్త ఎత్తేశారు

బల్లికురవ, సెప్టెంబరు 25 : మండలంలోని పలు గ్రామాలలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో గ్రామాలలో స్వచ్ఛత ఎక్కడ అన్న కథనంపె జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు అన్ని గ్రామాల కార్యదర్శులను అప్రమత్తం చేసి వెంటనే రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. కొణిదెన, నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, వేమవరం గ్రామాలలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పర్యవేక్షణలో రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను యంత్రాలతో తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. మురికి కాలువల్లో ఉన్న చెత్తను రెండు రోజుల్లో తొలగిస్తామని వారు తెలిపారు.



కొణిదెనలో రోడ్ల వెంబడి వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది



పరీక్షా పత్రాలను విడుదల చేస్తున్న రామారావు, ఉపాధ్యాయులు

ప్రతిభను వెలికితీసేందుకే చెకుముకి

చినగంజాం, సెప్టెంబరు 25 : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. మండలంలోని కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్సు సంబరాలు-2024 టాలెంట్ టెస్ట్ పరీక్షా పత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేయనున్నట్లు రామారావు తెలిపారు. చినగంజాం ఉన్నత పాఠశాలలో పరీక్షా పత్రాలను పాఠశాల హెచ్ఎండీ రత్నకుమారి, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు ఆవిష్కరించారు. రాజుబంగారుపాలెం, పల్లెపాలెం, అడవీధిపాలెం, పెదగంజాం జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టాలెంట్ టెస్ట్ పరీక్షా పత్రాలను ఆవిష్కరించినట్లు నరసింహారావు తెలిపారు. మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ని అక్టోబరు 1వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశేష స్పందన

ఇంకొల్లు : విద్యార్థులలో సైన్స్‌పై పట్టు పెంచేందుకు జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షకు విశేస స్పందన వచ్చింది. మండలంలో 6 పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు 300 మంది విద్యా హాజరైనట్లు మండల జన విజ్ఞాన వేదిక కన్వీనర్ చెంచయ్య తెలిపారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు పాఠశాల టీంగా అక్టోబరు 1వ తేదీన జరిగే మండల స్థాయి పరీక్షకు అర్హత కల్పిస్తామని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నార్నె సమత, ఎస్‌కే మస్తాన్‌వలి తెలిపారు.

కోలలపూడి హైస్కూల్‌లో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

మార్టూరు, సెప్టెంబరు 25 : మండల స్థాయి ఉన్నత పాఠశాలల అండర్ 17, అండర్ 14 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను బుధవారం మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయుడు జీ రామకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వీ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలైన వారు నియోజకవర్గస్థాయిలో ఇంకొల్లు మండలం గంగవరం హైస్కూల్‌లో గురువారం జరగనున్న పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని 200 మంది బాలబాలికలు ఆటల పోటీలలో పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులందరూ సహకరించారు. కార్యక్రమంలో తాళ్లూరి శ్రీను,కె, శ్రీనివాసరావు, ఖాసిం తదితర ఉపాధ్యాయులు సహకరించారు.



నిరసన తెలుపుతున్న హమాలీలు

హమాలీల నిరసన

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 25 : మండల పరిధిలోని దేశాయిపేట ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్ పాయింట్) వద్ద అందులో పని చేసే హమాలీలు తమ కూలి రేట్లు పెంచాలని డిమాండ్ కళ్లకు గంతలు కట్టుకుని బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రతినిధి పైడయ్య మాట్లాడుతూ హమీలకు కూలి రేట్లు 9 క్రితమే పెంచాల్సి ఉందన్నారు. అయినా పౌరసరఫరాల శాఖ, ప్రభుత్వం హమాలీల కూలీ రేట్లును పెంచలేదన్నారు. అందుకు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి హమాలీల కూలీరేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేసే హమాలీలు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు



వీరాస్వామిని సత్కరిస్తున్న ఎంఈవో వెంకట్రామయ్య

పర్చూరు, సెప్టెంబరు 25 : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫెడరేషన్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా పర్చూరులోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు బుధవారంతో ముగిసాయి. చివరి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో గేమ్స్ నిర్వహించారు. చివరిరోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో మండలంలోని చెరుకూరు జిల్లా పరిషత్, ఎస్ఎస్ఎస్ పాఠశాల, ఆక్స్‌ఫర్డ్, వీరన్నపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కారుమంచి వీరాస్వామిని విద్యాశాఖాధికారి ఎన్.వెంకట్రామయ్య సారథ్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్ చౌదరి, హెచ్ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 25 : ఇంకొల్లులో బుధవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన కందిమళ్ల సరోజని (82) మృతి చెందగా, రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల డాక్టర్లు నేత్రాలను సేకరించారు. ఇందుకు సహకరించిన కుటుంబసభ్యులను కమిటీ సభ్యులు రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీక్లబ్ అధ్యక్షకార్యదర్శులు రవీ, సాంబశివరావు అభినందించారు.



నూకసానిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సీఎం బాబును కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 25 : సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కలిశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని, అందుకు సహకరించాలని సీఎం చంద్రబాబును కోరారు. మరి కొన్ని విషయాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. అనంతరం రాష్ట్రంలో కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన వారిని కలిశారు. సెక్రటరియేట్‌లో, పలువురు మంత్రులను కొండయ్య కలిశారు. ఫైనాన్స్ సెక్రటరీ, ఎండోమెంట్ బాధ్యులను కలిశారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని కొరిశపాడు ఐసీడీఎస్ సీడీపీవో ఏ కృష్ణకుమారి అన్నారు. బుధవారం మండలంలోని వేలమూరిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, ఆహార కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.ఇందిర, బి.ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : విద్యార్థులు మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని హెల్త్ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. బుధవారం హెల్త్ స్వచ్ఛంద సంస్థ టీఐ, బాపట్ల హెచ్ఐవీవి, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని సాధన జూనియర్ కాలేజీలో మీకు తెలుసా, ఐసీఈ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, మద్యం, మదకద్రావ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బొడ్డు నాగార్జున, డైరెక్టర్ వెంకట్రావు, పీఈలు మల్లేశ్వరి, శివపార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లు ఆక్రమణ ఫిర్యాదుపై కేసు

చీరాలటౌన్, సెప్టెంబర్ 25 : తమ ఇల్లును ఆక్రమించడంతోపాటు విలువైన సామగ్రిని విక్రయించారని చీరాల హరిప్రసాద్ నగర్‌కు చెందిన బాల అకమ్మరావు, భార్య యశోద ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఇసుక డంప్‌లను ఏర్పాటు చేయాలి

చీరాల, సెప్టెంబరు 25 : ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో స్థానికంగా ఇసుక డంప్‌లు లేక ఇసుక కొరత ఏర్పడింది. దీంతో నిర్మాణాలు ఆగుతున్నాయని తాపీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తహసీల్దార్ గోపీకృష్ణను కలసి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ రంగానికి సంబంధించిన అన్ని పనుల వారికి పని ఆగిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తాపీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బల్లికురవ ఎంపీడీవోగా కుసుమకుమారి

బల్లికురవ. సెప్టెంబరు 25 : బల్లికురవ ఎంపీడీవోగా కుసుమకుమారిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దర్శి మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న కుసుమకుమారిని బల్లికురవకు నియమించారు. బల్లికురవ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న రాంబాబును మార్టూరు మండల పరిషత్ కార్యాలయానికి ఏవోగా బదిలీ చేశారు. అక్టోబరు మెదటి వారంలో ఎంపీడీవో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

ఇంకొల్లు : ఇంకొల్లు మండల అభివృద్ధి అధికారిగా ఘట్టా శ్రీనివాసరావును నియమించారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా కోట శ్రీనివాసకుమార్, టైపిస్టుగా భాస్కర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి కొరిశపాడుకు బదిలీ అయ్యారు.

జూదరుల అరెస్టు

పర్చూరు, సెప్టెంబరు 25: పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారంలో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,050 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల గ్రూపులకు రుణాలు

బల్లికురవ, సెప్టెంబరు 25 : వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఉపయెగపడేలా రైతు ఉత్పత్తి దారుల గ్రుపులకు సకాలంలో రుణాలు అందజేస్తామని అంబడిపూడి యూనియన్ బ్యాంకు మేనేజర్ అజిత్ తెలిపారు. బుధవారం అంబడిపూడి గ్రామానికి చెందిన ఓం నమఃశివాయ రైతు ఉత్పత్తి దారుల గ్రుపునకు రూ.16 లక్షల రుణాన్ని బ్యాంకు అధికారులు అందజేశారు. పది మంది సభ్యులకు పంటల సాగుకు ఈ రుణం ఎంతో ఉపయెగ పడుతుందని సకాంలో చెల్లింపులు చేస్తే రైతు గ్రుపులకు రుణాలను తమ బ్యాంకు అందజేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేంద్రబాబు, ఎఫ్‌పీవో రాయి పేరయ్య, ఫార్మర్ మిత్ర దమ్ము అంజయ్య, రైతులు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

తాగునీటి పథకం వద్ద ఇష్టానుసారంగా ధరలు

- 20 లీటర్లకు రూ.2కు బదులు రూ.5 వసూలు
- ప్రశ్నిస్తే మా ఇష్టం అంటూ బుకాయింపు



భవానీ సెంటర్‌లోని ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : ప్రజలకు సురక్షితమైన తాగునీటిని తక్కువ ధరకు అందించేందుకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. నిర్వాహకులు ధరలను తమ ఇస్టానుసారంగా పెంచి అమ్ముతున్నారు. వ్యాపారులు 20 లీటర్ల క్యాన్‌ను రూ.5కి వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇష్టం అంటున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని భవానీ సెంటర్‌లో ఆదెమ్మ బడి వద్ద ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకం వద్ద 20 లీటర్ల క్యాన్ నీటిని ఎవరికైనా రెండు రూపాయలకు విక్రయించాలి. ఇది మున్సిపాలిటీ ఆధీనంలో పని చేస్తుంది. అయితే అక్కడ ఉండే సిబ్బంది చిరు వ్యాపారులు, టీ దుకాణాల వారు, టిఫెన్ దుకాణాల వారు వస్తే 20 లీటర్లను రూ.5 వసూళ్లు చేస్తున్నారు. వ్యాపారాలు చేసుకునేవారికి రూ.2కు రాదని, ఇష్టమైతే కొనండి లేకపోతే మానుకోండని అంటున్నారని దుకాణదారులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి క్యాన్ నీటిని రూ.2కే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

20 లీటర్ల క్యాన్ రూ.2కే అమ్మాలి

ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ల వద్ద 20 లీటర్ల నీటి క్యాన్‌ను కేవలం రూ.2కే అమ్మాలి. వ్యాపారులు, టీ షాపులు, టిఫిన్ బండ్లు ఎవ్వరివద్దా కూడా అదనంగా తీసుకోవద్దు. అలా వసూలు చేస్తే చర్యలు తప్పవు.

- ఎం.మరియదాసు, ఏఈ, మున్సిపాలిటీ, అద్దంకి

పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు

- రోగులకు మెరుగైన సేవలకు దోహదం
- ఎమ్మెల్యే ఏలూరి కృషితో అభివృద్ధి
- పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి

పర్చూరు, సెప్టెంబరు 25 : పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు జాతీయ స్థాయి గుర్తింపు (నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్) లభించింది. ఈమేరకు నేషన్ హెల్త్ మిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గుర్తింపుతో రోగులకు పూర్తిస్థాయిలో వసతులు, సేవలు అందనున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి, బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలల్లో తొలిసారిగా పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి జాతీయ స్థాయి గుర్తింపు పొందడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మారినప్పటికీ అరకొర వసతులు, వైద్య సేవలు అందుతున్న తరుణంలో ఆసుపత్రిని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.4కోట్ల వ్యయంతో కార్పొరేట్ వైద్యశాలగా అభివృద్ధి చేశారు. గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న సంకల్పంతో అప్పటి వైద్య ఆరోగ్య మంత్రి కామినేని శ్రీనివాసరావు ద్వారా మరో కోటి నిధులతో వైద్య పరికరాలను సమకూర్చారు. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కోసం మార్చురీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో పర్చూరు ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోగులకు అందుతున్న సేవలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

రోగులకు మెరుగైన సేవలు



ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడం ఆనందదాయకం. దీంతో రోగులకు అన్ని రకాల సేవలందుతాయి. ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో ఇప్పటికే ఆసుపత్రి కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చెందింది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం.

- డాక్టర్ సిద్ధార్థ, సూపరింటెండెంట్, పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి

మాగుంట కుటుంబానికి తీరని శోకం

- అనారోగ్యంతో మాజీ ఎంపీ పార్వతమ్మ మృతి
- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



పార్వతమ్మ (ఫైల్)

జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న 'మాగుంట' కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మాగుంట పార్వతమ్మ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. చెన్నై నుంచి నెల్లూరులోని మాగుంట స్వగృహానికి చేరిన పార్వతమ్మ మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాగుంట కుటుంబంతో ఉన్న తన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో గురువారం పార్వతమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి.

- వివరాలు 8లో..

3 నుంచి టెట్

జిల్లాలో 4 కేంద్రాల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 25 : ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ గ్లోరీ కుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కావలి పీబీఆర్ విశ్వోదయ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, రూరల్‌లోని ఆయాన్ డిజిటల్ జోన్ కలిపి మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్స్, బ్లూటూత్, స్మార్ట్‌వాచీలు, ఇతర ఏ ఎలక్ట్రానిక్ గాడ్జెట్లనూ అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులలో ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7893258325, 9441148062, 6305364463 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హమ్మయ్య.. గుంతలు పూడనున్నాయ్!

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాకు రూ.3.4 కోట్లు.. గూడూరుకు రూ.4.69 కోట్లు

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. కొన్నేళ్ల నుంచి గుంతల రోడ్లతో నరకం అనుభవిస్తున్న ప్రజలకు త్వరలోనే ఉపశమనం లభించనుంది. ప్రజా జీవనంలో కీలకమైన రోడ్లను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం ఐదేళ్లపాటు గుంతలు కూడా పూడ్చలేదు. అయితే కూటమి ప్రభుతం అధికారంలోకి రాగానే ఈ గుంతల రోడ్లపై దృష్టి పెట్టింది. అత్యవసరంగా చేయాల్సిన పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించింది. అధికారుల ప్రతిపాదనలను ఆమోదిస్తూ వర్షాకాలంలోపు గుంతలు పూడ్చేందుకు రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. కావలి, నెల్లూరు డివిజన్ల పరిధిలోని 170 కిలోమీటర్ల మేర రోడ్లపై ఉన్న గుంతల పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చనున్నారు. ఇక గూడూరు డివిజన్‌లోని రోడ్లు కూడా అత్యంత దారుణంగా మారిపోయాయి. గూడూరు- రాజంపేట రోడ్డు, గూడూరు-తూపిలిపాలెం రోడ్డు, గూడూరు-వరగలి రోడ్డు, ఓజిలి-గొల్లపల్లి రోడ్డు వంటి వాటిపై ప్రయాణం నరకంగా మారింది. ఈ డివిజన్‌లోని 14 ప్రధాన రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మరో రూ.4.69 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే టెండర్లు పిలిచారు. అక్టోబరులోపు టెండర్లతోపాటు అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసి నవంబరులో గుంతలు పూడ్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

డీఆర్‌డీఏ ఏపీఎంలకు బదిలీ ఉత్తర్వులు

నెల్లూరు (హరనాథపురం) : బదిలీలు పొందిన ఏపీఎంలు, సీసీలకు డీఆర్‌డీఏ ఏపీడీ రాజు బుధ వారం ఉత్తర్వులు అందచేశారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి ఏపీఎంలు, సీసీలు నెల్లూరు జిల్లాకు బదిలీపై వచ్చారు. అదే విధంగా నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు బదిలీ అయిన వారు కూడా ఉత్తర్వులు అందుకున్నారు. 44 మంది ఏపీఎంలకు, 83 మంది సీసీలకు, ఏడుగురు సీసీలకు ఏపీడీతో పాటు డీఆర్‌డీఏ హెచ్ఆర్ అధికారి సుధాకర్ బదిలీ ఉత్తర్వులు అందచేశారు.

'ఎక్సైజ్' డీసీగా శ్రీనివాసరావు

- పలువురు అధికారుల బదలీ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 25 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా డిప్యూటీ కమిషనర్ కె హేమంత్ నాగరాజును ఒంగోలుకు బదిలీ చేసి ఆయన స్థానంలో విజయవాడ ఏపీఎస్‌బీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న టీ శ్రీనివాసరావును నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అసిస్టెంట్ కిమిషనర్ దయాసాగర్‌ను నెల్లూరు ఏసీగా నియమించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె నాగమల్లేశ్వరరెడ్డిని తిరుపతికి బదిలీ చేయగా, వెయిటింగ్‌లో ఉన్న ఎ శ్రీనివాసులు నాయుడును నెల్లూరుకు కేటాయించారు.

నాకూ ఓ పదవి!

- నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ
- తొలివిడత జాబితా ప్రకటనతో పెరిగిన ఆశలు
- మలివిడతలో స్థానం కోసం కూటమి నేతల ఎదురుచూపు



రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సుముహూర్తం రానే వచ్చింది. నామినేటెడ్ పదవుల కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్న కూటమి నేతల్లో ఉత్కంఠ పెరిగింది. తొలి విడత జాబితాలో రాష్ట్ర కార్పొరేషన్ పదవులు భర్తీ చేయడంతో మలివిడతపై జిల్లా నేతల ఆశలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తమకూ ఓ పదవి దక్కాలని, ఆ శుభవార్త ఎప్పుడెప్పుడు తమ చెవినపడుతుందా? అని ఉవ్విళ్లూరుతున్నారు.

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, టికెట్లు త్యాగం చేసిన నాయకులు కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోపే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని కూటమికి నేతృత్వం వహించిన చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో జిల్లా నేతల ఆశలు మరింత పెరిగాయి. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులకు ఎవరు అర్హులు అనే అంశంపై తెలుగుదేశం, జనసేన, బీజేపీలు పెద్ద ఎత్తున కసరత్తు చేశాయి. అర్హుల జాబితా తయారీలో తెలుగుదేశం పార్టీ కొత్త పద్ధతులను అనుసరించింది. సిఫార్సులకు దూరంగా, పార్టీకి విధేయత, ఎన్నికల్లో పనిచేసిన తీరు, నాయకులకు ప్రజల్లో ఉన్న పట్టు, నీతి నిజాయితీ... ఇలా చాలా అంశాలను ప్రామాణికంగా తీసుకుని వడపోసింది. పదవుల కేటాయింపులో సామాజిక సమతూకం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. ఇక పదవుల భర్తీ జరుగుతుందనగా విజయవాడ ఉప్పెన ముంచుకురావడంతో వాయిదా పడింది. పక్షం రోజులు చంద్రబాబు రేయింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నం కావడంతో నామినేటెడ్ పదవుల భర్తీ ఇప్పట్లో జరగదని ఆశావహులు నిరుత్సాహ పడ్డారు. అయితే ప్రకృతిపరంగా ఉత్పన్నమైన సమస్యలు, పాలనాపరంగా చేయాల్సిన సంస్కరణలు ఎన్ని ఉన్నా, పార్టీ కోసం శ్రమించిన దిగువశ్రేణి నాయకులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఎవరూ ఊహించని విధంగా మంగళవారం నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాను ప్రకటించారు. వివిధ రాష్ట్ర కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు కీలకమైన వక్ఫ్‌బోర్డు చైర్మన్, టిడ్కో చైర్మన్ పదవులతోపాటు ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. దీంతో కూటమి నేతల్లో మళ్లీ ఆశలు పుంజుకున్నాయి.

కీలక పదవులు ఇవే...

జిల్లా పరిధిలో భర్తీ కావాల్సిన కీలక పదవులు నుడ, డీసీసీబీ, డీసీఎంఎస్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు, ఆలయాల పాలకమం డళ్లు మొదలైనవి. వీటి కోసం పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు. తొలి విడత జాబితా ప్రకటనతో ఇక మలివిడత జాబితాల వెల్లడికి ఎంతో కాలం పట్టదని సంబర పడిపోతున్నారు. సమయం దగ్గరపడిందన్న విషయం రూఢీ కావడంతో పదవుల కోసం చివరి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పోలేరమ్మ తల్లో..!

- వెంకటగిరిలో మొదలైన జాతర సంబరం
- అర్ధరాత్రి తర్వాత కొలువుదీరిన అమ్మవారి ప్రతిమ
- నేడు భక్తుల మొక్కులు.. దర్శనాలు



పోలేరమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

వెంకటగిరి, వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరిలో బుధవారం పోలేరమ్మ జాతర సంరంభం మొదలైంది. అమ్మవారి పుట్టింటివారైన కుమ్మరి వారు బుధవారం తెల్లవారుజామున పోలేరమ్మ ప్రతిమ తయారీ మొదలుపెట్టి.. సాయంత్రానికి పూర్తి చేశారు. ఆ ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా అక్కడే భక్తుల దర్శనార్థం ఉంచారు. అక్కడ్నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకీపై అమ్మవారికి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటికి రాత్రి 9.30-10.30 గంటల మధ్య తీసుకొచ్చారు. మరోవైపు పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెం చేరడతో ఘటుం కార్యక్రమం ముగిసింది. కాంపాళెం వద్ద అమ్మవారి అప్ప చెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు రాత్రి 11 గంటల సమయంలో పూజలు చేసి అక్కడ పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించి.. గాలిగంగల సారెలను ముగించారు. అక్కడ్నుంచి గాలిగంగలు బయలు దేరి జీనిగలవారి వీధిలోని చాకలింటికి చేరుకుని అమ్మవారి ముందు నిలిపారు. కోడి తలను నోటితో కొరికి అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరించారు. తద్వారా అమ్మవారి ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ జరిగి శక్తిస్వరూపంగా సిద్ధమవుతుందని స్థానికుల నమ్మకం. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన సప్పరంపై అమ్మవారిని కూర్చోబెట్టారు. తర్వాత కరెంట్ సరఫరా నిలిపేశారు. దివిటీల వెలుగులు, ఆసాదుల తప్పెట్లు, యువత చిందుల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో గురువారం తెల్లవారుజామున కొలువుదీర్చనున్నారు. బద్దె గొర్రెను బలివ్వడంతో తొలిరోజు జారత ముగిసింది.



● జాతరలో నేడు

గురువారం తెల్లవారుజామున పోలేరమ్మ దేవస్థానం వద్ద కొలువు తీరిన అమ్మవారికి వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఇంటి ముంగిట జీవాలను బలిస్తారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి విరూపోత్సవం కోసం పూలతో అలంకరించిన రథం నగరినుంచి దేవస్థానం వద్దకు రావడంతో విరూపోత్సవం మొదలవుతుంది. పురవీధుల గుండా మల్లయ్య తోటలోని విరూప మండపం వద్దకు చేరుకోగా.. అమ్మవారి ప్రతిమను కత్తితో నరికి విరూపం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ తంతు అంతా అమ్మవారి ప్రతిమ తయారైన 24 గంటల్లో జరగాలన్నది ఇక్కడి ప్రజల నమ్మకం.

● రూ.50 లక్షల విడుదల

తిరుపతి(కలెక్టరేట్): వెంకటగిరిలో జరుగుతున్న పోలేరమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.50లక్షలు విడుదల చేసింది. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకంటించిన నేపథ్యంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.50లక్షలు విడుదల చేయాలని జీవో జారీ చేసింది.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



కావలి : దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, సెప్టెంబరు 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నమస్కార్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షత వహించగా నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, సుందరశెట్టి సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

●**జలదంకి:** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం జలదంకిలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు వంటేరు రాకేష్‌రెడ్డి, ముడి కిషోర్‌రెడ్డి, కమతం బాలకోటయ్య, గణాది మహేష్‌లు పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జంపాని ప్రసాద్, ఎస్టీ మోర్చా నేత సముద్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దుత్తలూరు సెంటర్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు చుండి హరిగోపాల్‌రెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, అందే రామయ్య, పసల కృష్ణ, లెక్కల వెంకటరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నందిగుంట స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక ఇరిగేషన్ అతిథి భవనంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అరాచక పాలన : ఎమ్మెల్యే కాకర్ల



వరికుంటపాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



లింగసముద్రం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వరికుంటపాడు, సెప్టెంబరు 25: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోనూ అరాచక పాలన సాగిందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం వరికుంటపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో సతీమణి కాకర్ల ప్రవీణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 600 మంది రైతుల భూములను బలవంతంగా లాక్కొన్న ఘనత ఆపార్టీ వారికే దక్కుతుందన్నారు. అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. తిమ్మారెడ్డిపల్లి-గణేశ్వరాపురం రహదారితోపాటు కాకొల్లువారిపల్లి గ్రామానికి సైతం రహదారి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే భోగ్యంవారిపల్లిలో రహదారికి అడ్డుగా నిర్మించిన ఇంటి ప్రహరీని కూల్చివేసేందుకు చర్యలు చేపడతానన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడి వాటర్‌ప్లాంట్ల నిర్మాణం చేపడతానన్నారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణాలు పూర్తి చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి మీదుగా ర్యాలీ చేపట్టి ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి స్టిక్కర్లు అంటించారు. తొలుత పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది, దోస పంటలను పరిశీలించి వ్యవసాయం లాభసాటి చేసి రైతులను ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతిచెందడంతో మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ, సర్పంచ్ దిలీప్‌కుమార్, నాయకులు పొద మాధవరావు, పేరం సుధాకర్‌రెడ్డి, నాదిండ్ల రాజేంద్ర, తెల్లగొర్ల వెంకటయ్య, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఏడీఏలు శేషగిరి, చెన్నారెడ్డి, ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనను ఆదరించండి : ఇంటూరి

లింగసముద్రం : కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి, వందరోజుల పాలన గురించి వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆయన్ను మేళతాళాలతో గుర్రంపై ఊరేగించారు. తదుపరి ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని 14 డ్వాక్రా సంఘాలకు రూ.2.48 కోట్ల రుణాలను పంపిణీ చేశారు.అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఏపీఎం కే సింహాద్రిరావు, టీడీపీ నాయకులు వేముల గోపాలరావు, అడపా నర్సయ్య, మాజీ ఎంపీపీ కల్పన, సర్పంచు పులి రాఘవులు, జనసేన నాయకులు కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా అడుగులు వేసిందని, రానున్న మంచి రోజులకు పునాది ఈ వంద రోజుల పాలనే నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు తెలిపారు. బుధవారం ఆత్మకూరు మండలం కరటంపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను, స్టికర్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, బిజెపి నాయకుడు ఉప్పలూరు నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** తిక్కవరంలో బుధవారం జరిగిన ఇంది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎన్డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కర పత్రాలు పంచారు. అనంతరం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా సీఎం చంద్రబాబు నెరవేర్చుకుంటూ వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి మర్రిపాడు మండల అధ్యక్షులు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, ఎంపీడీవో నగమణి, ఎంఆర్వో స్వప్న, మండల అధికారులు నాయకలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆత్మకూరు, సెప్టెంబరు 25: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మహి మలూరు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు తేజ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

ఆత్మకూరు, సెప్టెంబరు 25: హెచ్ఐవీపై యువత అవగాహన కలిగి ఉండాలని సార్ఫ్ సంస్థ పీఎం బెనోమీ, పలువురు వ్యక్తలు తెలిపారు. బుధవారం పట్టణం లోని ప్రియదర్శిని కాలేజిలోని విద్యార్థులకు, నెల్లూరు పాళెంలోని పొదుపు మహిళలకు, ఆటోస్టాండ్ కార్మికులకు సార్ఫ్ సంస్థ ఆత్మకూరు, కావలి విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ప్రియదర్శిని కాలేజి ప్రిన్సిపాల్ వి శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సార్ఫ్ సంస్థ సిబ్బంది కవితప్రియ, సునంద తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

మండలంలోని 22 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, జేవీవీ నాయకులు ఎస్ మురళీకృష్ణ, ఓ మల్లికార్జున, హెచ్‌హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వార్డులు, రక్త పరీక్షల, మందుల గదులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనీషా, రాగూర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



సభలో మాట్లాడుతున్న కన్నమనాయుడు

బిట్రగుంట, సెప్టెంబరు 25: అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలసికట్టుగా పని చేసిన ప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీ సీఈవో కన్నమనాయుడు అన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటసుబ్బా రావు ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, భద్రత, రవాణా సౌకర్యం, పరిశ్రమల స్థాపన, తీరప్రాంతాల అభివృద్ధి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు పీ.అనిత, టీడీపీ నేత ఎం.నాగేశ్వరావు, ఏవో గోవిందరావు, విస్తరణాధికారి జహీర్‌బాష, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ గ్రామాల అభివృద్ధిలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో గ్రామాల అభివృద్ధికి ప్రజలు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సామ్రాజ్యం, కల్పన, రమణమ్మ, ఉపసర్పంచ్ ముర్తుజా, ఈవోపీఆర్డీ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు అమర్నాథ్‌రెడ్డి, చినబాబు పాల్గొన్నారు.

దుత్తలూరు : దుత్తలూరు పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-2047 విజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, నాయ కులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఎం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె అజయ్ కుమార్ కోరారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఫలితంగా ఈప్రాంతంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ రిజర్వాయర్లు ముందుకు సాగలేదన్నారు. దశాబ్దాలుగా ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అధ్వాన్నంగా ఉన్న ఉదయగిరి-నందవరం రహదారిపై రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, మల్లికార్జున, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, తిరుపతయ్య, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని సున్నవారిచింతల గ్రామ సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. తిరుమలాపురం గ్రామానికి చెందిన అలూరి వెంకటేశ్వరరెడ్డి ఉదయగిరికి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సున్నంవారిచింతల గ్రామ సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు.

స్కూల్ గేమ్స్ పోటీలు, ఎంపికలు

కావలిటౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని జడ్పీ క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గస్థాయి పోటీలు, ఎంపికలు జరిగాయి. డిప్యూటీ డీఈవో రఘురామయ్య పాల్గొని పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి నియోజకవర్గ జట్లకు ఎంపిక చేశారు. గురువారం గేమ్స్‌తో పాటు అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు జడ్పీ పీడీ చిరంజీవి తెలిపారు. జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఎంఈవో-1 గోవిందయ్య ఎంఈవో-2 సుబ్బయ్య, హెచ్‌ఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నియోజకవర్గస్థాయి అండ్-14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను కన్వీనర్ తిరుపతయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారిని నియోజకవర్గ స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. వీరు నెల్లూరులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

విషాదంలో 'మాగుంట' కుటుంబం

● మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూత

● ప్రభుత్వ లాంఛనాలతో నెల్లూరులో నేడు అంత్యక్రియలు

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'మాగుంట' కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మె ల్యే మాగుంట పార్వతమ్మ (77) అనారోగ్యంతో బాధప డుతూ బుధవారం తెల్లవా రుజామున చెన్నైలో మృతి చెందారు. మాజీ ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి సతీమణి అయిన పార్వతమ్మ.. భర్త మరణాంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లో కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. భర్త ఆశయాలకు అనుగుణంగా, రాజకీయాల పరంగా ఒంగోలు, కావలి ప్రాంతాల్లో పార్వతమ్మ తనదైన ముద్ర వేసుకున్నారు. కాగా పార్వతమ్మ భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం చెన్నై నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న నివాసంలో అభిమానుల సందర్శనార్థం మృతదేహాన్ని ఉంచారు. గురువారం మధ్యాహ్నం పార్వతమ్మ అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్‌లతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. కాగా పార్వతమ్మ మృతిపట్ల ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు సంతాపం ప్రకటించారు. మాగుంట కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని, పార్వతమ్మ తన పట్ల చూపించిన అభిమానాన్ని వెంకయ్య గుర్తు చేసుకున్నారు. మాగుంట కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలానే రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలు కూడా పార్వతమ్మ మృతికి సంతాపం ప్రకటించారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల అభివృద్ధికి పార్వతమ్మ చేసిన కృషిని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సీవీ శేషారెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, మాదాసు గంగాధరం, నివాళులర్పించిన వారిలో ఉన్నారు. టీడీపీ నేత బీద రవిచంద్ర ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. కాగా మాగుంట పార్వతమ్మను చివరిసారి చూసేందుకు అభిమానులు, వారి సంస్థల్లోని ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

● **కావలి అభివృద్ధి ప్రదాతగా..**

కావలి : మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి పట్టణ వాసులను, ప్రముఖులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. జమీందారు కుటుంబంలో జన్మించినా ఒక సామాన్యురాలిగా పార్వతమ్మ అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధితోపాటు విస్తృత సేవలు అందించారు. 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లో కావలి ఎమ్మెల్యేగా మాగుంట పార్వతమ్మ కావలికి అం దించిన సేవలతో మంచి పేరు సంపాదించుకున్నారు. సోమశిల ఉత్తర కాలువను గుడి పాడు నుంచి రాళపాడు రిజర్వాయర్ వరకు పొడిగించి మెట్ట ప్రాంతాలాలైన జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల రైతులకు సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించారు. కావలి సమ్మర్ స్టోరేజి ట్యాంకుకు చినక్రాక రిజర్వాయర్ నుంచి భూగర్భ పైపులైన్ ద్వారా మంచినీరు అందించారు. అలాగే కావలిలో వెనుకబడిన వెంగళరావునగర్, పుల్లారెడ్డి నగర్ ప్రాంతాలకు రాజీవ్‌నగర బాట ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తెప్పించి, అభివృద్ధి చేసింది. ట్రంకు రోడ్డును నాలుగు లైన్ల సీసీ రోడ్డు నిర్మాణం పార్వతమ్మ కృషి ఫలితమే. కావలిలో పేదలకు నివాసగృహాల కోసం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సుమారు 6 వేలకు పైన ఇళ్లను ఆమె హయాంలోనే నిర్మింపజేశారు. కావలి ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మంచినీరు సరఫరా చేశా రు. ప్రజలను తన వాహనంలో కార్యాలయాలకు తీసుకెళ్లి అధికారులు, సంబంధిత శాఖ మం త్రులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేవరకు వారిని వదిలేవారు కారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నా కావలితో పార్వతమ్మకు ఉన్న అనుబంధాలను కొనసాగించేవారు.

ట్రంకురోడ్డుకు పార్వతమ్మ పేరు

● **ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**



మాగుంట పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, సెప్టెంబరు 25: మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ కృషితో కావలి ట్రంకురోడ్డు నాలుగు లైన్ల సీసీ రోడ్డుగా ఏర్పాటు అయినందున, ఆ రోడ్డుకు ఆమె పేరు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు త్వరలో కౌన్సిల్ తీర్మానం కూడా తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. మాగుంట పార్వతమ్మ(77) బుధవారం మృతి చెందటంతో కావలి టీడీపీ కార్యాలయంలో, ట్రంకు రోడ్డులోని బ్రిడ్జి సెంటర్‌లలో ఆమె సంస్మరణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని పార్వతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే నెల్లూరులోని మాగుంట నివాసంలో ఉన్న పార్వతమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతమ్మ మరణం రాజకీయ పార్టీలకు, కావలి ప్రజలకు తీరని లోటన్నారు. సామాన్య కార్యకర్త కోసం కలెక్టర్ నుంచి సీఎం వరకు వెళ్లి పని పూర్తి చేయటం ఆమె నైజమన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీకళాశాలలో, కావలి రెడ్‌క్రాస్ భవనంలో కూడా పార్వతమ్మ చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

●**ఉదయగిరి రూరల్:** మాగుంట పార్వతమ్మ మృతి పేదప్రజలకు తీరని లోటని టీడీ పీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల సంతా పాన్ని వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే, ఎంపీ పర్యటన రద్దు

●**అల్లూరు:** మండలంలోని ఇస్కపల్లిలో గురవారం నిర్వహించ తలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మండల టీడీపీ నేతలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి కారణంగా ఈ కార్యక్రమాన్ని ఆపివేశామని తెలిపారు.

సబ్ ట్రెజరీలో రికార్డుల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: స్థానిక సబ్ ట్రెజరీలో బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆడిట్ అధికారులు మోషే, యుగంధర్, నరేంద్ర ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవో సీహెచ్ మమత, సీనియర్ అకౌంటెంట్లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

జలదంకి, సెప్టెంబరు 25: మండలంలోని జలదంకి బ్రాహ్మణక్రాక, కమ్మవారిపాలెం గ్రామాల్లో ఏవో శైలజ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను వరి పైరులోకి తీసుకెళ్లి చీడపీడలు నివారణ, రసాయనిక ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వీపీఏలు పాల్గొన్నారు.

●**వలేటివారిపాలెం:** మండలంలోని అయ్యవారిపల్లె, అంక భూపాలపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. అయ్యవారిపల్లె, అమ్మపాలెం సర్పంచులు డేగా వెంకటేశ్వర్లు, చెన్నిబోయిన ఓబులుకొండయ్య రైతులు ప్రెగడ మోహన్‌కుమార్ చెంచు శ్రీనివాసులు, సిరిగిరి కొండారెడ్డి, బక్కమంతుల ప్రసాద్ పాల్గొన్నారు.

అమృతధార వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, సెప్టెంబరు 25: పంచాయతీలోని సాతానువారిపాలెం, జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఉదయం నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరిన్ సమస్య ఎక్కువగా ఉండడం వలన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏక నాయకత్వం కింద అందరూ పనిచేయాలని ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఎన్డీవో అసోసియేషన్ తరపున వెలుగోటి మధు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకట్‌రెడ్డి, మండల కన్వినర్ గొంగటి రఘునాథరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గూడా నర్సారెడ్డి, జూపల్లి రాజా, వసంతరావు, సర్పంచ్‌లు చెరుకూరు రసూల్, సృజన, ఎంపీటీసీ భవానీ, ప్రసన్నరెడ్డి, అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష ఆర్థిక సాయం

మండలంలోని గుండెమడకల మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు గాలి నరసప్ప నాయుడు వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిల సమక్షంలో అందజేశారు. ఈమొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపం సుదర్శన్‌రెడ్డి, గురజాల వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●**లింగసముద్రం :** విజయవాడ వరద బాధితులకు పలువురు దాతలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా విరాళాలు అందజేశారు.బుధవారం లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యేకు మండలంలోని టీడీపీ నాయకులు రాజారపు మాలకొండయ్య రూ.25,116, దేవకి సుబ్రహ్మణ్యం రూ.10,000, షేక్ రఫీ రూ.10,000, షేక్ కరీముల్లా రూ.10,000, సయ్యద్ మాబు రూ.10,000, షేక్ హమద్ రూ.10,000, సయ్యద్ నాయబ్ రూ.10,000, ద్రోణాదుల వెంకటేశ్వర్లు రూ.10,000, ఏ వెంకటేశ్వరరావు రూ.20,000 కలిపి మొత్తం రూ. 1,15,116లను అందించారు. ఎమ్మెల్యే దాతలను అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, సెప్టెంబరు 25 : వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని మహిమలూరులో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రం, ఆరోగ్యవంతమైన సమాజం, అందరికీ విద్య, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర లక్ష్యాలను సాధించడానికి గ్రామసభల్లో ప్రజల నుండి వచ్చిన సూచనలను తీర్మానాల రూపంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

'పొలం పిలుస్తోంది'పై సమీక్ష

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమం డిసెంబరు నెలాఖరు వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో ఏడీఏ చెన్నారెడ్డి, ఏవో ఆంజనేయులనాయక్, ఏఈవోలు భోగ్యం సుధీర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం లక్ష్యమని వ్యవసాయాధికారి శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు, సంగం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. వచ్చే రబీ సీజన్‌లో ఎంపిక చేసుకునే వంగడాల రకాలు, వాటి నాణ్యత, విత్తన శుద్ధి, తదితర అంశములపై వివరించారు. అదేవిధంగా వెటర్నరీ వైద్యాధికారి సురేష్, మత్స్యశాఖ అసిస్టెంట్ ప్రసన్నలక్ష్మి పశువులు, చేపల పెంపకంపై రైతుల వివరించారు. వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

దొంగతనాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ

ఆత్మకూరు, సెప్టెంబరు 25: బ్యాంకు దొంగతనాలను అరికట్టేందకు పటిష్ట చర్యలు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధరరావు తెలిపారు. బుధవారం ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పోలీసు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో అన్ని ప్రధాన విభాగాలు కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఆలారం సిస్టమ్ ఎల్లవేళలా పనిచేశాలా జాగ్రత్త వహించాలని సూచించారు. ఏటీఎంల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీని ఏర్పాటు చేసి 24 గంటలు ఉండేలా చూసుకోవాలని, ఏటీఎంలలో సైతం సీసీ కెమెరాలు బిగించాల్సి ఉందన్నారు. బ్యాంకులు తాము తెలిపిన సూచనలను పాటించకపోతే బ్యాంకులు, ఏటీఎంల వద్ద జరుగు దొంగతనాలకు బ్యాంకు అధికారులు బాధ్యత వహించవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐలు జిలాజీ, సాయిప్రసాద్, పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన గోవా మద్యం : ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గోవా మద్యంతో ఎస్ఐ అంకమ్మ, సిబ్బంది

ఉలవపాడు, సెప్టెంబరు 25 : అక్రమంగా అమ్ముతున్న గోవా మద్యాన్ని పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, గుడ్లూరు మండలం మోచర్లకి చెందిన పచ్చిపాల వినోద్, కావలి మండలం ముసునూరుకి చెందిన అడపా మనోజ్‌కుమార్‌లు గోవా మద్యంను అక్రమంగా తరలించి, మండలంలోని చాకిచర్ల గ్రామం హైస్కూల్ వద్ద అమ్మేక్రమంలో వారి వద్ద నుంచి 93 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తీసుకొచ్చి విచారించగా నెల్లూరుకి చెందిన బుజ్జి అలియాస్ అబ్దుల్ అజీజ్ అమ్మమని ఇచ్చినట్లు చెప్పారని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్ఐ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించనట్లు ఆయన తెలిపారు.